PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం – ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 15, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 06 - మార్చి - 2026 , వెల రూ.5/-

## రాజ్యసభకు నితీష్.. బీహార్ సీఎం రేసులో ఇద్దరు?




పాట్నా: బీహార్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోనున్నట్లు నితీష్ కుమార్ అధికారికంగా ప్రకటన చేశారు. తాను రాజ్యసభకు వెళ్తున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో తదుపరి బీహార్ ముఖ్యమంత్రి ఎవరు? అనే చర్చ మొదలైంది. అయితే, బీహార్‌లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉన్న కారణంగా బీజేపీ నుంచి ముఖ్యమంత్రి స్థానం దక్కించుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం.

## రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన బీహార్ సీఎం నితీశ్ కుమార్




పాట్నా: బీహార్ సీఎం నితీశ్ కుమార్.. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి ఖ్యాతి సింగ్ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ నామినేషన్ పేర్లను అందజేశారు. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసినట్లు నితీశ్ తన ఎక్స్‌లో వెల్లడించారు.

## ఇరాన్ అణ్వాయుధాలు వదిలేస్తుందా?... మంత్రి వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చిన అధికారిక మీడియా




అమెరికా, ఇజ్రాయెల్‌తో నువ్వా నేనా అన్నట్లు తలపడుతున్న ఇరాన్ అమెరికా సంతృప్తికర ఆఫర్ ఇస్తే అణు కార్యక్రమాన్ని నిలిపివేసే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించినట్లు వార్తలు

# తిరుపతిలో కవిత నోట 'జై ఆంధ్ర' నినాదం

- తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన కవిత
- రేణిగుంట విమానాశ్రయంలో జై ఆంధ్ర అంటూ నినాదం
- తన పార్టీకి స్వామి వారి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నానని వ్యాఖ్య




అమరావతి: తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ఒక నూతన ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న కల్వకుంట్ల కవిత తిరుపతి పర్యటనలో చేసిన వ్యాఖ్యలు

# గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీ

### 2027 జూలై 23 నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలు

- గోదావరి పుష్కరాల నిర్వహణపై 9 మందితో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
- కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్ బాబు.. కన్వీనర్‌గా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి
- ప్రధాన ఆలయాలు, ఘాట్ల వద్ద శాశ్వత ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు, ప్యాకేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం




హైదరాబాద్: తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గోదావరి పుష్కరాలకు (2027) ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించింది. 'దక్షిణ కుంభమేళా'గా పిలిచే ఈ మహా క్రతువు నిర్వహణ, ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది సభ్యులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి,

## యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు: ప్రధాని మోదీ

- ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు
- చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం అని ఉద్ఘాటన
- ఉగ్రవాద నిర్మూలనే ఇరువురి ఉమ్మడి లక్ష్యం అని ప్రకటన
- వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం
- విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం

ఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు,







## విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు: కేటీఆర్

బీఆర్ఎస్ హయాంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామన్న కేటీఆర్

## తెలంగాణ మహిళలకు ఉమెన్స్ డే గిఫ్ట్..

### రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

డ్వాక్రా మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనుంది




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని కోట్లాది మంది మహిళల సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న డ్వాక్రా మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీన ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 46 లక్షల మంది

## జగన్ జీతం తీసుకోవడం లేదు




- వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకపోవడంపై అయ్యన్నపాత్రుడు అసహనం
- గవర్నర్ ప్రసంగం రోజున సభలో కాసేపు ఉన్నంత మాత్రాన అది పూర్తి హాజరు కాదని వ్యాఖ్య
- వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదన్న స్పీకర్

# ఏపీలో జననాల రేటు దారుణంగా పడిపోతోంది

- కుటుంబ నియంత్రణ నుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ వైపు ఏపీ అడుగులు
- 2047 నాటికి రాష్ట్ర జనాభాలో 23 శాతం వృద్ధులే ఉండే ప్రమాదం
- పిల్లలు లేని వారికి ఐవీఎఫ్ ద్వారా ప్రభుత్వమే సాయం చేస్తుంది
- ముసాయిదా పాలసీపై నెల రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ







అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత కీలకమైన 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' (జనాభా నిర్వహణ) విధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో కీలక ప్రకటన చేశారు. దశాబ్దాలుగా అమలులో ఉన్న 'ఫ్యామిలీ ప్లానింగ్' విధానం నుంచి ఇకపై 'పాపులేషన్ కేర్' వైపు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సిద్ధం చేసిన ముసాయిదా పాలసీని సభలో ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో జననాల రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ – టీఎఫ్ఆర్) ఆందోళనకరంగా పడిపోతోందని ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరించారు. 1993లో 3.0గా ఉన్న ఫెర్టిలిటీ రేటు ప్రస్తుతం 1.5కు పడిపోయిందని తెలిపారు.

## ఏపీలో 'డ్రైవర్ కమ్ గైడ్'.. పర్యాటక రంగంలో దేశంలోనే తొలి ప్రయోగం




- ఏపీలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'డ్రైవర్ కమ్ గైడ్' విధానం
- రాష్ట్ర పర్యాటక శాఖ, ర్యాపిడో సంస్థల మధ్య కీలక ఒప్పందం
- విజయవాడలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభం.. తర్వాత ఇతర నగరాలకు విస్తరణ
- ర్యాపిడో యాప్‌లోనే పర్యాటక ప్రాంతాల వివరాలు, గైడ్ సేవలు

## అది ఒక కులంపై మరో కులం చేసిన దాడి: కాపు నేతల సమావేశంలో అంబటి రాంబాబు




- కరణం ధర్మశ్రీ నివాసంలో కాపు నేతల బ్రేక్ ఫాస్ట్ మీటింగ్
- తన ఇంటిపై దాడిని చంద్రబాబు, లోకేశ్ పర్యవేక్షించారన్న అంబటి
- ఎర్ర బుక్కులకు భయపడేది లేదని వ్యాఖ్య

## రాజ్యసభకు నితీష్.. బీహార్ సీఎం రేసులో ఇద్దరు?





మొదటి పేజి తరువాయి

అయితే, బీహార్‌లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉన్న కారణంగా బీజేపీ నుంచి ముఖ్యమంత్రి స్థానం దక్కించుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు జాతీయ మీడియాలో ఇద్దరి పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. బీహార్ కొత్త సీఎంగా సామ్రాట్ చౌదరి బాధ్యతలు చేపట్టవచ్చని తెలుస్తోంది. అలాగే, నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. కాగా, అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. ఇక, సామ్రాట్ చౌదరి బీహార్ రాజకీయాల్లో అంతర్భాగంగా ఉన్నారు. పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నప్పటి నుండి ప్రస్తుతం రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వరకు బీజేపీ నాయకుడిగా కీలక పదవులను నిర్వహించారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా రెండవసారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సీఎం రేసు కోసం నిత్యానంద్ రాయ్ కూడా పోటీలో ఉన్నారు. రాయ్ ప్రస్తుతం హోంమంత్రిగా పనిచేస్తున్నారు. కేంద్రంలో పని చేయడానికి ముందు, రాయ్ బీహార్‌కు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. రాయ్ హాజీపూర్ నుండి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. 2015లో రాయ్ పార్లమెంటరీ టికెట్ గెలుచుకుని ఉజియార్‌పూర్ నుండి ఎంపీగా పనిచేశారు. మరోవైపు.. నితీష్ కుమారుడు నిశాంత్ డిప్యూటీ సీఎం అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

నితీష్ కీలక వ్యాఖ్యలు..

అంతకుముందు సీఎం నితీష్ కుమార్ ట్విట్టర? వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు.'గత రెండు దశాబ్దాలకు పైగా మీరు నాపై ఉంచిన విశ్వాసం, మద్దతు నిరంతరం కొనసాగుతోంది. అదే బలంతో మేము బీహార్ రాష్ట్రానికి, మీ అందరికీ సంపూర్ణ నిబద్ధతతో సేవ చేయగలిగాం. మీ విశ్వాసం, మద్దతు వల్లే బీహార్ ఈరోజు అభివృద్ధి మరియు గౌరవానికి కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. ఇందుకు నేను గతంలో కూడా మీ అందరికీ పలుమార్లు కృతజ్ఞతలు తెలిపాను. నా పార్లమెంటరీ జీవితాన్ని ప్రారంభించినప్పటి నుంచే ఒక కోరిక నా మనసులో ఉంది. బీహార్ శాసన మండలి (విధాన మండల) రెండు సభలతో పాటు, పార్లమెంట్‌లోని రెండు సభల సభ్యుడిగా కూడా ఉండాలని ఆశించాను. ఆ క్రమంలో ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడిగా మారాలని కోరుకుంటున్నాను. మీతో నా ఈ అనుబంధం భవిష్యత్తులో కూడా అలాగే కొనసాగుతుందని నేను పూర్తి నిజాయితీతో హామీ ఇస్తున్నాను. మీ అందరితో కలిసి అభివృద్ధి చెందిన బిహార్ నిర్మాణం అనే సంకల్పం అలాగే కొనసాగుతుంది. కొత్తగా ఏర్పడే ప్రభుత్వానికి నా పూర్తి సహకారం మరియు మార్గదర్శనం ఉంటుంది' అని ఆయన అధికారిక ప్రకటన చేశారు.

## రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన బీహార్ సీఎం నితీశ్ కుమార్



మొదటి పేజి తరువాయి

రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసినట్లు నితీశ్ తన ఎక్స్‌లో వెల్లడించారు. బీహార్‌కు అత్యధిక కాలం సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిగా నితీశ్ రికార్డు క్రియేట్ చేశారు. అయితే రాజ్యసభలో సభ్యుడు కావాలన్న కాంక్ష ఉన్నట్లు ఆయన తెలిపారు. నితిశ్ తన అభిప్రాయాన్ని ఎక్స్‌లో వ్యక్తం చేశారు. బీహార్ రాజకీయాల్లో పెను మార్పులు జరగనున్నట్లు ఆయన చెప్పారు. నితీశ్ తప్పుకోవడంతో.. బీహార్‌కు బీజేపీ అభ్యర్థి సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక నితీశ్ కుమారుడు నిషాంత్.. డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టే ఛాన్సు ఉన్నది. రెండు దశాబ్ధాల పాటు తనపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఉంచారని, దీని ఆధారంగానే బీహార్‌కు సేవ చేశానని, మీ నమ్మకం, మద్దతుతోనే బీహార్‌ను కొత్త అభివృద్ధి కోణం వైపు తీసుకెళ్లినట్లు చెప్పారు. తనపై నమ్మకాన్ని ఉంచి సపోర్టు ఇచ్చినందుకు గతంలో అనేక సార్లు కృతజ్ఞులు చెప్పినట్లు నితీశ్ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం మొదలైన నాటి నుంచి.. బీహార్ అసెంబ్లీ, మండలితో పాటు.. పార్లమెంట్ ఉభయసభల్లోనూ సభ్యుడిని కావాలన్న కాంక్ష ఉండేదని చెప్పారు. ఆ కోరికతోనే రాజ్యసభ సభ్యుడిని అయ్యే సందర్భం వచ్చిందన్నారు. భవిష్యత్తులో మీతో ఇదే రకమైన రిలేషన్ కొనసాగుతుందన్నారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. బీహార్ సీఎం పోస్టు రేసులో నిత్యానంద్ రాయ్‌తో సమ్రాట్ చౌదరీ ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది.

## ఇరాన్ అణ్వాయుధాలు వదిలేస్తుందా?... మంత్రి వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చిన అధికారిక మీడియా

ఢిల్లీ: తమకు సంతృప్తికర ఆఫర్‌ను అమెరికా ప్రకటిస్తే తాము కూడా అణు కార్యక్రమాలను నిలిపివేసే అంశాన్ని పరిశీలిస్తామని ఇరాన్ విదేశాంగ శాఖ డిప్యూటీ మంత్రి మాజిద్ తఖ్త్ ప్రకటన చేసినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. ఇది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో నువ్వానేనా అన్నట్లు ఢీకొంటున్న ఇరాన్ మంత్రి నుంచి ఇలాంటి ప్రకటన వచ్చిందని కథనాలు రావడం గమనార్హం. అయితే, మంత్రి వ్యాఖ్యలపై ఇరాన్ అధికారిక మీడియా స్పందించింది. ఆయన వ్యాఖ్యలు తాజా పరిణామానికి సంబంధం లేదని స్పష్టం చేసింది. అవి మంత్రి గతంలో చేసిన వ్యాఖ్యలని పేర్కొంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి అనంతరం ఆ దేశం అమెరికా, ఇజ్రాయెల్ ముందు కుదేలవుతుందని అందరూ భావించారు. కానీ ఆరు రోజులుగా ఇజ్రాయెల్, అమెరికా దేశాల సంయుక్త దాడికి ఇరాన్ ప్రతిదాడి చేస్తోంది. అయితే అనూహ్యంగా ఇరాన్ మంత్రి అమెరికా ముందు ప్రతిపాదన ఉంచినట్లు వార్తలు రావడం గమనార్హం. ఇరాన్ మంత్రి నుంచి ఈ ప్రకటన వెలువడిందని వార్తలు వెలువడిన నిమిషాల్లోనే ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ స్పష్టతను ఇచ్చింది. విదేశాంగ శాఖ డిప్యూటీ మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు అణు ఒప్పందంపై అమెరికాతో గతంలో జరిగిన చర్చలకు సంబంధించినవని పేర్కొంది. తాజా పరిణామంతో ఈ వ్యాఖ్యలకు సంబంధం లేదని, ఇరాన్ కొత్తగా ఎలాంటి ప్రకటన చేయలేదని తెలిపింది.

## తిరుపతిలో కవిత నోట 'జై ఆంధ్ర' నినాదం

అమరావతి: తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ఒక నూతన ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న కల్వకుంట్ల కవిత తిరుపతి పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశంగా మారాయి. కొత్త పార్టీని ప్రకటించబోతున్నట్లు ఇప్పటికే సంకేతాలిచ్చిన ఆమె... తిరుమల శ్రీవారి మొక్కు తీర్చుకోవడానికి కుటుంబ సభ్యులు, జాగృతి నాయకులతో కలిసి తిరుపతికి చేరుకున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న సమయంలో ఆమె 'జై ఆంధ్ర' అని నినాదం చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తన రాక సందర్భంగా ఏపీలోని శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారని కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో తాము ప్రారంభించబోతున్న రాజకీయ పార్టీకి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నానని అన్నారు. మరోవైపు, తనను ఇబ్బంది పెట్టిన కేసుల నుంచి కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కవిత హర్షం వ్యక్తం చేశారు. సత్యం తన వైపు ఉన్నందునే దైవకృపతో కేసుల నుంచి విముక్తి లభించిందని, ఆ మొక్కు తీర్చుకునేందుకే అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు వెళుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా తాను స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీకి శ్రీవారి ఆశీస్సులు ఉంటాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వం ప్రాతిపదికగా తన రాజకీయ ప్రయాణం ఉంటుందని చెబుతున్న కవిత, ఏపీలో 'జై ఆంధ్ర' అనడం వెనుక వ్యూహాత్మక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీ సెటిలర్ల ఓట్లు ఏ ఎన్నికల్లోనైనా కీలకంగా మారుతుంటాయి. ఈ నేపథ్యంలో, వారిని ఆకట్టుకోవడానికి కవిత ఈ నినాదాన్ని వాడుకున్నారా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు వెళుతున్నారు. రేపు ఉదయం స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ పర్యటన ముగిసిన వెంటనే తన కొత్త పార్టీ పేరు మరియు విధివిధానాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు: కేటీఆర్

హైదరాబాద్: విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూసీ పరివాహక ప్రాంతంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామని గుర్తు చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. హైదరాబాద్ నగరంలోని నాగోల్‌లో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ రూ.16 వేల కోట్లతోనే ఆ పనులు చేయవచ్చని అన్నారు. మూసీ సుందరీకరణ పనులను తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని అన్నారు. పైగా ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తామని అన్నారు. హామీల అమలు కోసమే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఇంటిని నిర్మించినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు.

# యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు: ప్రధాని మోదీ

ఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్' పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది" అని మోదీ చమత్కరించారు.



కొత్త శకంలో భారత్-యూరప్ బంధం

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియా-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కీలక ఒప్పందాలపై సంతకాలు

ఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు. భారతీయ విద్యార్థులకు, ప్రతిభావంతులకు ఫిన్లాండ్ ఇప్పుడు ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య పరిశోధనలు, స్టార్టప్ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు. విద్యా రంగంలో ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడిన మోదీ.. ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్-టు-స్కూల్ భాగస్వామ్యం, భవిష్యత్ విద్యా విధానాలపై సహకారాన్ని విస్తరించుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. నార్డిక్ ప్రాంతంలో ఫిన్లాండ్ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల పరిశోధనల్లోనూ తమ సహకారం కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

## గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీ



మొదటి పేజి తరువాయి

ఈ కమిటీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పి.సుదర్శన్ రెడ్డిలను నియమించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి గోదావరి తీర ప్రాంతాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశాలకు పిలవనున్నారు. త్వరలోనే కమిటీ సమావేశమై సిఫార్సులను అందజేయనుంది. 2027 జూలై 23న గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈసారి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సుమారు 560 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తుండటంతో దాదాపు 74 ఘాట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ముఖ్యంగా బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. పుష్కరాల ఏర్పాట్లు తాత్కాలికంగా కాకుండా, శాశ్వత ప్రాతిపదికన ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధి, పర్మనెంట్ పుష్కర ఘాట్లు, రోడ్లు, వసతి సముదాయాలు నిర్మించాలని ఆదేశించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ట్రాఫిక్, పార్కింగ్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## తెలంగాణ మహిళలకు ఉమెన్స్ డే గిఫ్ట్..




మొదటి పేజి తరువాయి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీన ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 46 లక్షల మంది డ్వాక్రా మహిళలకు ఈ పథకం కింద 30 రకాల అత్యవసర వైద్య పరీక్షలను పూర్తిగా ఉచితంగా చేస్తారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రాల భాగస్వామ్యంతో ఈ పరీక్షలు నిర్వహించనుండగా.. రాబోయే ఆరు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మహిళల ఆరోగ్యంపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు.. వారికి ఒక శాశ్వత డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ను రూపొందించడం ఈ కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా చెప్పవచ్చు. ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వం మూడు విడతల ప్రణాళికను సిద్ధం చేసింది. మొదటి విడతలో భాగంగా ప్రతి జిల్లా నుంచి ప్రాధాన్యత కలిగిన 5 మండలాలను ఎంపిక చేస్తారు. ఆ తర్వాత రెండో విడతలో మరో 10 మండలాలను చేర్చుతారు. ఇక చివరి విడతలో రాష్ట్రంలోని మిగిలిన అన్ని మండలాల్లోని మహిళలకు స్క్రీనింగ్ పూర్తి చేసి.. వైద్య సేవలు అందిస్తారు. కేవలం మహిళలే కాకుండా.. చిన్నారుల ఆరోగ్యంపై కూడా సర్కార్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. మార్చి 6 నుంచి 26వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు , ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ముఖ్యంగా విద్యార్థుల్లో రక్తహీనత సమస్యను గుర్తించి.. వారికి అవసరమైన చికిత్స.. పౌష్టికాహార సలహాలను అందించనున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి.. జూన్ 12 వరకు చేపట్టాల్సిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ ను విడుదల చేశారు. దీని ప్రకారం.. సబ్ సెంటర్ల పరిధిలో బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ టెస్టులు చేపడతారు. డయాలసిస్ రోగులకు వైరల్ ఇన్ఫెక్షన్ పరీక్షలు నిర్వహించడంతో పాటు, డే-కేర్ క్యాన్సర్ సెంటర్లలో కీమోథెరపీ సేవలను మరింత మెరుగుపరుస్తారు. రాబోయే ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అన్ని ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ (రా-సా) ప్యాకెట్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. మే 16 నుంచి పట్టణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను పాలీక్లీనిక్స్‌గా మార్చడంతో పాటు.. బస్తీలలో మొబైల్ వాహనాల ద్వారా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు.

## జగన్ జీతం తీసుకోవడం లేదు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరవుతుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్రంగా స్పందించారు. ఈరోజు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల గురించి గళం విప్పుతారని ఓట్లు వేసి గెలిపిస్తే, సభకు రాకుండా పారిపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మండిపడ్డారు. సభకు హాజరుకాకుండా కేవలం బయట ఉంటూ జీతభత్యాలు తీసుకోవడం నైతికంగా సరికాదని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని, ఆ పార్టీ అధినేత జగన్ మాత్రం జీతం తీసుకోవడం లేదని చెప్పారు. కేవలం గవర్నర్ ప్రసంగం రోజున వచ్చి కాసేపు నిరసన తెలిపి వెళ్లినంత మాత్రాన అది పూర్తిస్థాయి హాజరు అనిపించుకోదని స్పీకర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం వరుసగా 65 రోజుల పాటు సభకు అనుమతి లేకుండా గైర్హాజరైతే ఆ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ప్రజా ప్రతినిధులను 'రీకాల్' చేసే హక్కు ప్రజలకు ఉండాలని, దీనిపై చట్ట సవరణలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమస్య కేవలం ఏపీకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా చట్టసభల గౌరవాన్ని కాపాడటానికి లోక్‌సభ స్పీకర్‌ను కలిసి చర్చిస్తానని తెలిపారు. ప్రస్తుతం అసెంబ్లీలో ప్రతి ఎమ్మెల్యే సీటు వద్ద ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా సభ్యుల హాజరును కచ్చితంగా నమోదు చేస్తున్నామని, దీని ద్వారా ఎవరు ఎంతసేపు సభలో ఉన్నారో రికార్డు అవుతుందని స్పీకర్ వివరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 శాతం సీట్లు (18 మంది ఎమ్మెల్యేలు) ఉన్న పార్టీకి మాత్రమే ప్రతిపక్ష హోదా లభిస్తుందని, కేవలం 11 సీట్లు ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడం సాధ్యం కాదని అయ్యన్న పాత్రుడు మరోసారి తేల్చిచెప్పారు.

## అది ఒక కులంపై మరో కులం చేసిన దాడి
## కాపు నేతల సమావేశంలో అంబటి రాంబాబు

అమరావతి: విశాఖపట్నంలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ కాపు నేతల కీలక సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, కూటమి ప్రభుత్వంపై ముఖ్యంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కరణం ధర్మశ్రీ నివాసంలో జరిగిన ఈ 'బ్రేక్ ఫాస్ట్ మీటింగ్'లో గుడివాడ అమర్నాథ్ వంటి కాపు నేతలతో కలిసి ప్రస్తుత రాజకీయ పరిణామాలు, అక్రమ కేసులు, అరెస్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గుంటూరులోని తన నివాసంపై జరిగిన దాడిని స్వయంగా చంద్రబాబు, లోకేశ్ పర్యవేక్షించారని ఆయన ఆరోపించారు. టీవీ ఛానళ్లలో లైవ్ వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, పోలీసుల సమక్షంలోనే ఈ దౌర్జన్యం జరిగిందని మండిపడ్డారు. కేవలం దైవకృప వల్లే తాను ప్రాణాలతో బయటపడ్డానని అన్నారు. ఈ దాడిని ఒక కులం మరో కులంపై చేసిన దాడిగా ఆయన అభివర్ణించారు. సమాజంలో కులాల మధ్య చిచ్చు పెట్టి ప్రభుత్వం ఏం సాధించాలనుకుంటోందని ప్రశ్నించారు. గతంలో వంగవీటి రంగాను కూడా పోలీసుల సహకారంతోనే చంపారని, ఇప్పుడు తన విషయంలోనూ అదే పునరావృతమవుతోందని ధ్వజమెత్తారు. లోకేశ్ 'రెడ్ బుక్' బెదిరింపులకు తాము భయపడబోమని, అక్రమంగా తనను 18 రోజులు జైల్లో పెట్టారని గుర్తు చేశారు. తన జైలు శిక్ష సమయంలో ఉత్తరాంధ్ర నేతలు తన కుటుంబానికి అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. ఎర్ర బుక్కులు, పిచ్చి బుక్కులకు తాము భయపడబోమని చెప్పారు. కాపులను బీసీల్లో చేరుస్తామని గతంలో ఇచ్చిన హామీని చంద్రబాబు తుంగలో తొక్కారని, కాపుల కోసం ఉద్యమించిన ముద్రగడను వేధించారని విమర్శించారు. పవన్ కల్యాణ్ కూటమిలో ఉన్నంత మాత్రాన కాపులందరూ మీ వైపు ఉన్నారనుకోవడం భ్రమ అని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు పతనం మొదలైందని, ఈ దాడులకు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

## ఏపీలో 'డ్రైవర్ కమ్ గైడ్'.. పర్యాటక రంగంలో దేశంలోనే తొలి ప్రయోగం

అమరావతి:ఏపీలో పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలిసారిగా 'డ్రైవర్ కమ్ గైడ్' అనే సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. ప్రముఖ రవాణా సేవల సంస్థ ర్యాపిడోతో కలిసి ఏపీ పర్యాటక శాఖ ఈ పథకాన్ని అమలు చేయనుంది. ఈ ఒప్పందం ప్రకారం ర్యాపిడోకు చెందిన ఆటో, క్యాబ్ డ్రైవర్లే పర్యాటకులకు గైడ్లుగా కూడా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా తొలుత విజయవాడలో ప్రారంభించనున్నారు. ఇందుకోసం ర్యాపిడో డ్రైవర్లలో అత్యుత్తమ ఫైవ్-స్టార్ రేటింగ్ ఉన్న 280 మందిని ఎంపిక చేశారు. వీరిలో 248 మంది ఆటో డ్రైవర్లు, 32 మంది క్యాబ్ డ్రైవర్లు ఉన్నారు. ఎంపిక చేసిన డ్రైవర్లకు పర్యాటక ప్రాంతాల చరిత్ర, సాంస్కృతిక ప్రాధాన్యత, విశిష్టతలు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పర్యాటకులతో మర్యాదపూర్వకంగా ఎలా మెలగాలి, వారి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే విదేశీయులతో మాట్లాడేందుకు గూగుల్ ట్రాన్స్‌లేట్ వంటి యాప్‌లను ఎలా ఉపయోగించాలనే దానిపైనా అవగాహన కల్పిస్తున్నారు. ఈ పథకం కోసం ర్యాపిడో తన యాప్‌లో ప్రత్యేకంగా 'టూరిస్ట్ గైడ్' అనే ఆప్షన్‌ను అందుబాటులోకి తేనుంది. పర్యాటకులు యాప్ ఓపెన్ చేయగానే, సమీపంలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల జాబితా కనిపిస్తుంది. వారు కోరుకున్న ప్రాంతాన్ని ఎంచుకుంటే, శిక్షణ పొందిన డ్రైవర్ కమ్ గైడ్ వారిని తమ వాహనంలో అక్కడికి తీసుకెళ్లి, ఆ ప్రదేశం గురించి సమగ్రంగా వివరిస్తారు. విజయవాడ పరిసరాల్లోని భవానీ ద్వీపం, కొండపల్లి కోట, ఉండవల్లి గుహలు, అమరావతి స్థూపం, మంగినపూడి బీచ్ వంటి ప్రాంతాలకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. పర్యాటక ప్యాకేజీల ధరలను పర్యాటక శాఖ, ర్యాపిడో సంస్థలు సంయుక్తంగా నిర్ణయించి త్వరలోనే ప్రకటించనున్నాయి. విజయవాడలో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైన తర్వాత విశాఖపట్నం, తిరుపతి వంటి ఇతర ప్రధాన నగరాలకు కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ వినూత్న ప్రయత్నం ద్వారా పర్యాటకులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు డ్రైవర్లకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఏపీలో జననాల రేటు దారుణంగా పడిపోతోంది




మొదటి పేజి తరువాయి

1993లో 3.0గా ఉన్న ఫెర్టిలిటీ రేటు ప్రస్తుతం 1.5కు పడిపోయిందని తెలిపారు. జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ వంటి దేశాల్లో ఏర్పడిన క్లిష్ట పరిస్థితులే ఇప్పుడు ఏపీలోనూ కనిపిస్తున్నాయన్నారు. జననాల రేటు ఇలాగే వేగంగా తగ్గిపోతే భవిష్యత్తులో పనిచేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయి, ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇద్దరు పిల్లల కంటే తక్కువ ఉన్నవారికి రాజకీయ ప్రాతినిధ్యం దక్కదేమో అని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పుడు జోక్యం చేసుకోకపోతే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే 2047 నాటికి మన జనాభాలో 23 శాతం మంది వృద్ధులే ఉంటారని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం 'ఐదు అంచెల లైఫ్ సైకిల్' విధానాన్ని తెరపైకి తెచ్చినట్లు వెల్లడించారు. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని అనే ఐదు పిల్లర్ల ద్వారా మహిళ గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మహిళల లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగా ఉందని, దీనిని 59 శాతానికి పెంచగలిగితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతానికి చేరుతుందని అంచనా వేశారు. సంతానోత్పత్తి సమస్యలతో బాధపడే దంపతులను ఆదుకునేందుకు 'మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. ఇందులో భాగంగా పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) పద్ధతిలో తక్కువ ఖర్చుతో లేదా సబ్సిడీపై ఐవీఎఫ్ సేవలు అందించే ఆలోచనలో ఉన్నామన్నారు. అలాగే అనవసర సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం, ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజ్ గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తీసుకురావడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ ముసాయిదా పాలసీని ప్రజల ముందు ఉంచుతున్నామని, దీనిపై రాబోయే నెల రోజుల పాటు విస్తృత చర్చ జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అందరి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే దీనికి తుది రూపం ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఖమేనీ మృతిపై తొలిసారి స్పందించిన భారత్

ఢిల్లీ: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతిపై భారత్ తొలిసారి స్పందించింది. ఖమేనీ మృతిపట్ల ఇండియా సంతాపం తెలిపింది. ఢిల్లీలోని ఇరాన్ ఎంబసీకి వెళ్లిన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. సంతాప సందేశం రాశారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై గత శనివారం ఇజ్రాయెల్, అమెరికా జరిపిన భీకర దాడుల్లో ఖమేనీ మరణించడం తెలిసిందే. శత్రు దుర్భేద్యమైన భద్రత కలిగిన అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించడం సంచలనం సృష్టించింది. ఖమేనీ కోసం కొన్ని నెలలపాటు కొనసాగిన వేట చివరకు రెండు గంటల ఐదు నిమిషాల ఆపరేషన్‌తో ముగిసింది. నిఘా వర్గాలు అందించిన పక్కా సమాచారంతోనే ఆయనను అంతం చేసినట్లు తెలుస్తోంది. ఖమేనీ నివాసంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఏకంగా 30 క్షిపణులను ప్రయోగించాయి. దాంతో ఆయన తప్పించుకోలేకపోయారు. అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. తమ హిట్‌లిస్ట్‌లో ఉన్న ఖమేనీపై అమెరికా నిఘా సంస్థ సీఐఏ ఎప్పటినుంచో దృష్టి పెట్టింది. ఖమేనీతో జరిగిన భేటీకి ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ ఇన్ చీఫ్ మొహమ్మద్ పాక్‌పోర్, రక్షణ శాఖ మంత్రి అజీజ్ నజీర్‌జాదే, మిలటరీ కౌన్సిల్ అధినేత అడ్మిరల్ అలీ షామ్‌ఖనీ, ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ కమాండర్ సయ్యద్ మాజిద్ మౌసావీ, డిప్యూటీ ఇంటెలిజెన్స్ మంత్రి మొహమ్మద్ షిరాజీతోపాటు మరికొందరు ముఖ్యులు హాజరయ్యారు. ఇజ్రాయెల్ క్షిపణి దాడుల్లో వీరంతా హతమయ్యారు. ఖమేనీ భార్య మన్సూరే ఖోజాస్తే మృతి చెందారు. ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఆమె చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.

## మళ్లీ సోనూసూద్ ఉదారత.. ఈసారి దుబాయ్‌లో..

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నడుమ దుబాయ్‌లో చిక్కుకుపోయిన ప్రయాణికుల కోసం నటుడు, మానవతావాది సోనూ సూద్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సంక్షోభం కారణంగా దుబాయ్‌లో తలదాచుకుంటున్న పర్యాటకులు, ప్రయాణికులకు ఉచిత వసతి కల్పిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియా వేదికగా ఒక వీడియోను విడుదల చేస్తూ, బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కరోనా మహమ్మారి సమయంలోనూ సోనూసూద్ వందలమందికి సాయం అందించారు. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం పశ్చిమాసియాలోని విమానయాన రంగాన్ని అతలాకుతలం చేసింది. ఫిబ్రవరి చివరిలో ఇరాన్ లక్ష్యాలపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు జరిపాయి. దానికి ప్రతిచర్యగా గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. ఈ పరిణామాల దృష్ట్యా భద్రతా కారణాలతో పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేయడం, విమాన సర్వీసులను రద్దు చేయడంతో దుబాయ్‌లో వేలాది మంది ప్రయాణికులు దిక్కుతోచని స్థితిలో చిక్కుకున్నారు. విమానాల రద్దు, దారిమళ్లింపుల వల్ల విమానాశ్రయాల్లోనే గంటల తరబడి నిరీక్షిస్తున్న బాధితుల కష్టాలను చూసి సోనూ సూద్ స్పందించారు. ఈ క్లిష్ట సమయంలో భారతీయులతో పాటు ఏ దేశానికి చెందిన వారైనా సరే, దుబాయ్‌లో వసతి లేక ఇబ్బంది పడుతుంటే తనకు నేరుగా మెసేజ్ పంపాలని సోనూ సూద్ కోరారు. బాధిత ప్రయాణికులు తమ స్వదేశాలకు చేరుకునే వరకు వారికి ఉచిత వసతి కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. 'మానవత్వానికి దేశ సరిహద్దులు, నిబంధనలు ఉండవు' అని పేర్కొంటూ, దుబాయ్‌లో ఆశ్రయం అవసరమైన వారు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

## సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి



పులిచెర్ల, మార్చి 5,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం దేవళం పేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు ఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఉభయ దారులుగా కరణీకం సంఘం వారు వ్యవహరించారు.

## వి.సి. వడ్డిపల్లిలో శ్రీ వినాయకశ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాల మహా కుంభాభిషేకం

**పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**



పులిచెర్ల, మార్చి 5,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం వి.సి. వడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వినాయకస్వామి మరియు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాల మహా కుంభాభిషేక మహోత్సవాలు భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణ పుణ్యకాలంలో పాల్గుణ మాసం బహుళ పంచమి సందర్భంగా ఈ కార్యక్రమాలను గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి ఆలయ నిర్వాహకులు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు ఆలయంలో పూజలు చేశారు మహోత్సవాల భాగంగా మార్చి 4న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పూజ్యశ్రీ హెచ్.జి. నిత్యముక్త దాస్ (ఇస్కాన్ తిరుపతి) వారి బృందంతో నగర సంకీర్తన, శ్రీ వెంకటేశ్వర స్వామి వైభవం కథా కార్యక్రమం, తులసీ హారతి, ప్రసాదం పంపిణీ నిర్వహించారు. అనంతరం సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు గంగాపూజ, గణపతి పూజ, వాస్తు పూజ, వాస్తు హోమం, మహా హారతి నిర్వహించారు. మార్చి 5 గురువారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య మహా కుంభాభిషేక మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అదే రోజు సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిపారు అనంతరం రాత్రి ఉత్సవమూర్తుల ఊరేగింపును గ్రామంలో నిర్వహించారుఈ కార్యక్రమాలు పూజ్యశ్రీ గోవింద స్వామి వారి బృందం (వంశపారంపర్య బ్రాహ్మణులు) ఆధ్యాత్మిక ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సమక్షంలో నిర్వహించబడుతున్నాయి. కుంభాభిషేకం సందర్భంగా వి సి. వడ్డిపల్లి భక్తి శోభతో అలరించింది

## కోరుకొండ కొత్త ఎస్సైగా రాజులపాటి అంకారావు బాధ్యతల స్వీకరణ..

**– ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..**




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా రాజనగరం నియోజకవర్గం కోరుకొండ పోలీస్ స్టేషన్ కి కొత్త ఎస్ఐగా రాజులపాటి అంకారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన ఎస్ శ్రీనివాస్ ఆకస్మికశీగా బదిలీ అయ్యారు. దీంతో అంకారావు కోరుకొండ నూతన ఎస్సైగా బదిలీపై వచ్చారు. ఆయన ఎంతవరకు బొమ్మూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా పనిచేసి కోరుకొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్త ఎస్ఐ అంకారావు మాట్లాడుతూ కోరుకొండలోని ప్రధాన సమస్యలపై దృష్టి పెడుతున్నట్టు చెప్పారు. ముఖ్యంగా కోరుకొండ బస్టాండ్, స్థానిక శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి టెంపుల్ రోడ్డు ట్రాఫిక్ సమస్యలు విపరీతంగా ఉన్నట్లు గుర్తించాను అన్నారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## నిడిగట్ల ఫిషర్ మాన్ సొసైటీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..

**– అధ్యక్షులుగా ధారా భాస్కర్, ఉపాధ్యక్షుడు దారా రాజ్ కుమార్ (దాసు)..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామ ఫిషర్ మాన్ సొసైటీ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. గ్రామంలోని ఎస్సీ కాలనీ అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద నిర్వహించిన సొసైటీ ఎన్నికలలో సంఘ సభ్యులు, స్థానిక దళిత నేతలు పాల్గొన్నారు. సొసైటీ నూతన అధ్యక్షులుగా ధారా భాస్కర్, ఉపాధ్యక్షుడు దారా రాజ్ కుమార్ (దాసు), ప్రధాన కార్యదర్శిగా కందికట్ల చినబాబు, సంఘ డైరెక్టర్లుగా మార్పు శ్రీను, ధారా అంబేద్కర్, ధారా భాను, కుడుములు ఏసుదాసు, కొత్తపల్లి చిన్న నాగేశ్వరరావు, నక్క గంగాధరంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మత్స్యశాఖ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎం బ్రహ్మానందం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఫిషరీస్ అసిస్టెంట్ జి.సూర్య, ఎన్నికల నిర్వహించారు. కోరుకొండ పోలీస్ లు బందోబస్తు నిర్వహించారు. గురువారం రాత్రి నూతన కార్యవర్గం, డైరెక్టర్లు జనసేన పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మేడిశెట్టి శివరాం ఆధ్వర్యంలో సమావేశమై సంఘ అభివృద్ధికి పాటుపడతామని పేర్కొన్నారు. కాగా నూతన కమిటీ నాయకులు, సభ్యులకు మేడిశెట్టి శివరాం అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా నిడిగట్ల మాజీ ఎంపీటీసీ సభ్యులు ఎడ్ల సత్యనారాయణ, స్థానిక నాయకులు, సభ్యులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సొంత ఖర్చులతో పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్స్ ను అందించిన యాగంటి



మాచర్ల ఆర్ సి ఇంచార్జ్ మార్చి 05(నేటి శుభోదయ):ఈ రోజు మాచర్ల పట్టణం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ లో పదో తరగతి విద్యార్థి విద్యార్థులను కలిసి త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎగ్జామ్స్ కావాల్సిన మెటీరియల్స్ ను విద్యార్థులకు సొంత ఖర్చులతో వారికీ అందించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీ యాగంటి మల్లికార్జున రావు గారు.. ఈ సందర్భంగా విద్యార్థి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన యాగంటి గారు.ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిలిచినందుకు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ అయ్యపు రెడ్డి హరిణి గారికి ధన్యవాదాలు తెలిపారు..జీవితంలో ఎదగటానికి మొట్టమొదటి బీజం పడేది స్కూల్ నందు అని వెల్లడించారు.. విద్యార్థులందరూ కూడా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరుకుంటున్నాను అని వెల్లడించారు..



దేశం పట్ల గౌరవం తల్లిదండ్రులు మీద ప్రేమ అనురాగాలతోటి ఉండాలని విద్యార్థి విద్యార్థులకు యాగంటి గారు సూచించారు..పదవ తరగతి విద్యార్థులు విద్యార్థులు అందరూ కూడా గ్రాడ్యుయేట్ అయ్యి కాలేజీ నుంచి బయటకు వచ్చేసరికి మన ఆంధ్ర రాష్ట్రంలో వందల కంపెనీలు వస్తాయని మీరు ఉద్యోగ అవకాశాల కోసం ఏ రాష్ట్రానికి కానీ వేరే దేశానికి కానీ వెళ్లకుండా మన రాజధాని అమరావతి లో ఆంధ్రప్రదేశ్ లోనే భారీగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని విద్యార్థిని విద్యార్థులకు వెల్లడించారు..ఇప్పుడు వస్తున్న సాంకేతికను విద్యార్థులు అందరూ కూడా అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చదువు చెప్పిన గురువులు పట్ల ఎప్పుడు అంకితభావంతో ఉండాలని తెలిపారు..ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిక్కా కొండల గారు బొట్టు కోటేశ్వరరావు గారు దుర్భాగులు ప్రసాద్ రావు గారు, బ్రహ్మయ్య గారు మరియు స్కూల్ డీన్ అనిల్ కుమార్ గారు,ఇంచార్జి శివ గారు స్కూల్ టీచర్స్ చెన్నకేశవులు గారు,లక్ష్మీనారాయణ గారు, ముక్కంటి గారు, చంద్రశేఖర్ గారు ,అరుణ గారు,నసీమ గారు మనోజ్ కుమార్ గారు మరియు స్కూల్ సిబ్బంది తదుపరులు పాల్గొన్నారు..

## తూప్రాన్ మున్సిపల్ తాతపాపనిపల్లి లో మహాత్మా గాంధీ విగ్రహంపై దాడి

**దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆర్యవైశ్య సంఘం డిమాండ్**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని తాతపాపన్‌పల్లిలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహంపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం తూప్రాన్ పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోవూరి శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో సంఘ సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం ప్రకారమే దాడి జరిగిందా.. అనే కోణంలో విచారిస్తు న్నారు ఈ సందర్భంగా లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ విగ్రహంపై దాడి జరగడం సమాజాన్ని కలవరపరిచే ఘటన అని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో కొన్ని ప్రాంతాల్లో మహాత్మా గాంధీ విగ్రహాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్న నేపథ్యంలో తాతపాపన్‌పల్లి ఘటన కూడా ఒక పథకం ప్రకారం జరిగి ఉండవచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు మహాత్మా గాంధీ వంటి మహనీయుల విగ్రహాలపై దాడులు జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకో వాలని దాడి చేసిన దుండగులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఆర్యవైశ్య సంఘం నాయకులు అనంతరం తూప్రాన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అధికారికంగా ఎస్ ఐ జ్యోతి కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మహాత్మా గాంధీ విగ్రహంపై జరిగిన దాడికి పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసుల ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు పల్లెర్ల రవీందర్ గుప్త ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉప్పల నర్సింలు గుప్తా ఆర్యవైశ్య మహాసభ జిల్లా నాయకులు బుక్క అశోక్ పల్లెర్ల బాలేష్ గుప్తా పెద్దిగారి నగేష్ గుప్త దేవత శ్రావణ్ కుమార్ బుక్క విజయ్ కుమార్ నేతి సాగర్ ఉప్పల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని దుండగులు తెలంగాణ తల్లి విగ్రహం ధ్వంసం చేశారు

**పోలీసులు కేసు నమోదు గాలింపు చర్యలు చేపట్టారు**

మార్చ్ 5 :తూప్రాన్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ధ్వంసం గుర్తుతెలియని దుండగుల పనేనని అనుమానం నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో తెలంగాణ గౌరవానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడం కలకలం రేపింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని గుర్తుచేసుకుంటూ తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాత్రి సమయంలో కొందరు దుండగులు ధ్వంసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మెట్లు ఎక్కి వెనుక భాగంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వీపు భాగాన్ని పగులగొట్టినట్లు స్థానికులు గుర్తించారు. ఉదయం స్థానికులు అక్కడికి చేరుకుని విగ్రహం ధ్వంసమై ఉండడాన్ని గమనించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ ప్రాంతం సీసీ కెమెరాల నిఘాలో ఉన్నప్పటికీ దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించి నిందితులను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ధ్వంసం చేయడం తెలంగాణ భావజాలాన్ని అవమానపరిచే చర్య అని స్థానిక ప్రజాప్రతినిధులు సామాజిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దుండగులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకో వాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. విగ్రహాన్ని పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## 5వ రోజు పూర్తి చేసుకున్న గడపగడపకు సిపిఐ కార్యక్రమం

సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా చేపట్టిన గడపగడపకు సిపిఐ కార్యక్రమం గురువారంకు ఐదు రోజులు పూర్తి చేసుకుంది. మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ భారత కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన అనేక పోరాటాలు గురించి భవిష్యత్ రోజుల్లో చేయబోయే కార్యక్రమాలు తెలియజేస్తూ గడపగడపకు సిపిఐ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఇప్పలగుంపు ఉదయనగర్ గ్రామాలలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్టా ప్రసాద్, సీనియర్ నాయకులు సన్నేపల్లి సాయిబాబులతో కలిసి స్థానిక సిపిఐ బృందం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పెద్దవాగు ప్రాజెక్ట్ తెగిపోవడం వలన వారు తీవ్రంగా నష్టపోయామని అలాగే ఇప్పుడు కూడా సకాలంలో పంటలకు నీరు అందక నష్టపోతున్నామని తెలియజేశారు. ప్రభుత్వానికి స్థానిక రైతులు పడుతున్న ఇబ్బందులను పదేపదే తెలియచేసిన పట్టించుకోకపోవడం సరైన చర్య కాదన్నారు. పెద్దవాగు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ మరమత్తులు వెంటనే చేపట్టకపోతే పోరాటాలు ఎదుర్కోక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని వెంటనే నెరవేర్చాలని, పోలవరం ప్రాజెక్టు వలన నష్టపోతున్న ప్రతి కుటుంబానికి పునరావాసం కల్పించడం నష్టపరిహారం అందించటం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాడిశ రాము, శాఖ కార్యదర్శి బంధం పెద్ద నాగేశ్వరావు, నాయకులు బంధం అర్జున్, మడివి కామయ్య, బంధం నాగేశ్వరావు, మడకం విజయ్ కుమార్, సోయం శ్రీను, మెడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## కింద పడిన నాగ చైతన్య.

(ప్రభ న్యూస్): రాష్ట్ర ఇన్ ఛార్జ్: హైదరాబాద్ ఓ థియేటర్ లో జరిగిన వృషకర్మ ప్రోగ్రాం లో హీరో నాగచైతన్యకు ప్రమాదం తప్పింది. ఆయన స్టేజీపై కూర్చున్న కుర్చీ అకస్మాత్తుగా వెనక్కి విరిగిపోవడంతో సెక్యూరిటీ సిబ్బంది వెంటనే స్పందించారు. అతనని కొట్టుకోవడం వల్ల గాయాల బారిన పడకుండా బయటపడ్డాడు. ఈ ఘటనతో అభిమానులు కంగారు పడ్డారు. వాళ్లను ఉద్దేశించి నాగచైతన్య చిరునవ్వుతో తాను బాగున్నానని సైగ చేసి ప్రసంగాన్ని కొనసాగించాడు.

## 4వ రోజు జనసేన క్రియాశీలక సభ్యత్వ ఉద్యమి ఉద్యమం..

**జనసైనికులుకు, కార్యకర్తలకు అభిమానులకు శుభవార్త.**

జనసేన క్రియాశీల సభ్యత్వాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జనసేన మండల ఉపాధ్యక్షుడు సాయికుమార్ పిలుపునిచ్చారు జనసేన ఉద్యమి లో భాగంగా 400 రూ. చెల్లించవలసిన రుసము కానీ మీకోసం మన కార్యకర్తల కోసం తన వంతు సహాయంగా 200 వేసుకొని మీకు 200 కే సభ్యత్వం చేస్తానుఅని.ఈ అవకాశం అందరు వినియోగించుకోవాలని తెలిపారు జనసేన సభ్యత్వం తీసుకోవడానికి కావలసినవి: 1. మీ ఆధార్ కార్డు 2. మీ నామినీ ఆధార్ కార్డు నెంబర్ 3. ఫోటో 4. 400/– రూపాయలు 5. మీ ఫోన్ నెంబర్ జనసేన పార్టీ సభ్యత్వం ద్వారా కలిగే ప్రయోజనాలు 1.సహజ మరణం అయితే 1 లక్ష రూపాయలు 2. ప్రమాదంలో గాయాలపాలైతే 50 వేల రూపాయల వరకు 3. ప్రమాదంలో మరణిస్తే ఐదు లక్షల రూపాయలు మీరు సంప్రదించవలసిన నెంబర్ 9652049271

## విద్యుత్ చార్జీలు తగ్గించుకోవాలి

**–జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

గురువారం కలెక్టర్ కార్యాలయంలో పి యం సూర్యఘర్ ప్రచార వాహనాన్ని జెండా ఊపి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రధానమంత్రి సూర్య గార్ పథకం ద్వారా గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఖర్చులు తగ్గించుకోవాలన్నారుఈ వాహనం మెదక్ జిల్లాలోని వివిధ మండలాలు,గ్రామాలు పర్యటించి పథకం గురించి అవగాహన కల్పించి పథకం యొక్క ప్రయోజనాలను ఎలా పెంపొందించాలో మార్గనిర్దేశనం చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విషాదం.. ఇద్దరు మృతి.

రాష్ట్ర ఇన్ ఛార్జ్; హైదరాబాద్ టౌలి సౌకి లో విషాద ఘటన చోటుచేసుకుంది. భవన నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో గోవా కట్టెలు ఒక్కసారిగా విరిగిపోవడంతో ఐదుగురు కార్మికులు ఐదవ అంతస్తు నుంచి కింద పడిపోయారు ఈ. ప్రమాదంలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వాళ్లను వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## వేసవి దృష్ట్యా త్రాగు నీటి సమస్యలు లేకుండ చూడాలి .ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ..

ఎన్టీఆర్ జిల్లా . మైలవరం నియోజకవర్గం .జి.కొండూరు మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించారు. వివిధ శాఖల అధికారుల తో సమీక్షలు నిర్వహించారు.గ్రామ సర్పంచులను శాలువతో సత్కారించి మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా 22 గ్రామ పంచాయతీలలో త్రాగు నీటి సమస్య లేకుండా చూడాలని, అధికారులు, ప్రజాప్రతినిధులను అన్ని కార్యక్రమాల్లో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.గ్రామాల్లో అభివృద్ధి పనుల కొరకు నిధులు మంజూరు చేస్తునట్టు తెలిపారు. తనకు అన్ని విధాలుగా సహకరించిన సర్పంచులకు ఎంపీపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వి రామకృష్ణ నాయక్. వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు. ఈలప్రోలు తేజ ,ఇంచార్జి తాసిల్దార్ పి.విజయ్ కుమార్. ఎంపీటీసీలు, సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్సులు పాల్గొన్నారు...

## మినరల్ ఫిల్టర్ వాటర్ సరఫరా చేసిన టిడిపి మైనార్టీ నాయకుడు షఫీక

స్టాఫ్ రిపోర్టర్ :శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణం రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి సవితమ్మ ఆదేశాల మేరకు ఎనిమిదో వార్డ్ ఇంచార్జ్ తెదెపా మైనార్టీ నాయకుడు సయ్యద్ షఫీక్ ఆధ్వర్యంలో దర్గాపేట,ఉప్పరబాడా లో స్వయంగా ప్రతి ఇంటికి వెళ్ళి మినరల్ ఫిల్టర్ వాటర్ సరఫరా చేసిన షఫీక్.ఈ సందర్భంగా సయ్యద్ షఫీక్ మాట్లాడుతూ తన వంతు సాయంగా పవిత్ర రంజాన్ నెలలో మంచినీటి ఫిల్టర్ వాటర్ సరఫరా చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ షఫిక్ తో పాటు,షేక్ ముక్తియార్ అహ్మద్ తదితర టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఎనిమిదివ వార్షికోత్సవాలు. -ఆలయం వద్ద భారీ అన్నదానం.

మండల కేంద్రమైన కిర్లంపూడిలో వేంచేయున్న శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఎనిమిదో కళ్యాణ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా ముగిసాయి. స్వామివారి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమానికి కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరంతోపాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదములు స్వీకరించారు.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, ఆలయ కమిటీ సభ్యుల మాట్లాడుతూ స్వామివారి కళ్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు, ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమానికి సహకరించిన భక్తులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు పాముల వీరబాబు, శరకణం భద్రం. వేగి రామకృష్ణ, పెంటకోట శ్రీరాములు, మళ్ల నాగు, నక్కా అప్పలరాజు, శరకణం తాతాజీ, పాముల చంటి, గౌతు చిన్న, యల్లపు నానాజీ,బొడ్డేటి గణపతి, లంక మూర్తి,నైదాన బాబ్జి,సంగన వెంకటేశ్వరరావు, మద్దాల రాంబాబు, కాళ్ళ పోలారావు పలువురు కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వీరవరం నుండి మర్లావ పుంత రోడ్డు శంకుస్థాపన కిర్లంపూడి ఎంపిపీ తోట రవి.

కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం వీరవరం గ్రామ నుండి మర్లావ వెళ్లే పుంత రోడ్డు కు నిధులు మంజూరు అయ్యాయి.లివీరవరం టు మర్లావ వెళ్లే పుంత రోడ్డుకు రూ.49 లక్షలతో ఎన్ఆర్జిఎస్ నిధులతో తారురోడ్డుకు శంకుస్థాపన చేసిన కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, సొసైటీ చైర్మన్ తోట గాంధీ, మర్లావ గ్రామ సర్పంచ్ తోట రామకృష్ణ శంకుస్థాపన చేసినారు.ఈ సందర్భంగా కిర్లంపూడి ఎంపీపీ తోట రవి మాట్లాడుతూ వీరవరం నుండి మర్లావ వెళ్లే పుంత రోడ్డు కు తారు రోడ్డు వెయ్యడం వల్లన వ్యవసాయ రైతులకు గ్రామ ప్రజలకు ఎంతో మెరుగైన రవాణా సౌకర్యం ఉంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వీరవరం గ్రామ టిడిపి అధ్యక్షుడు గొల్లపల్లి సూరిబాబు కూటమి నాయకులు రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఆకస్మిక తనిఖీ చేసిన కదిరి డీ ఎస్పీ.

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి గురువారం సాయంత్రం తనకల్లు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల రిజిస్టర్లు మరియు ఇతర పరిపాలనా అంశాలను పరిశీలించి, వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఎస్ ఐ దిలీప్ కుమార్ మరియు సిబ్బందితో సమావేశమై డీఎస్పీ శివ నారాయణ స్వామి మాట్లాడుతూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే విధంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులు ఎల్లప్పుడూ అప్డేట్‌లో ఉండేలా చూసుకోవాలని, గ్రామసంచారం నిరంతరం నిర్వహించాలని, ముఖ్యంగా రాత్రి సమయంలో గస్తీ మరింత చురుగ్గా చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన మైన వైఖరి పాటిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేలా పని చేయాలని సూచించారు.

## ఖే లో ఇండియా పోటీలలో సత్తా చాటిన ఎం జె పి గురుకుల బాలికల పాఠశాల నర్వ విద్యార్థులు




ఈనెల 1న బండ్లగూడ నాగోల్ వాటర్ బోర్డ్ సెంట్రల్ గ్రౌండ్లో జరిగిన , అస్మిత ఖే లో ఇండియా రాష్ట్రస్థాయి మహిళల సైక్లింగ్ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 272 మంది సైకిల్ రైడర్స్ పాల్గొనగా,నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో జిల్లా నుండి 60 మంది బాలికలు పాల్గొనగా, అందులో ఎం జె పి గురుకుల బాలికల పాఠశాల నర్వ సైకిలింగ్ రైడర్స్ 13 మంది పాల్గొని, మంచి ప్రతిభ చాటి 18 సంవత్సరాల లోపు పది కిలోమీటర్ల సైకిల్ పోటీలలో నేతావత్ సంజన 4 వ స్థానం, ఐదు కిలోమీటర్ల పోటీలలో తేజశ్రీ 5వస్థానం, శివాని 6వ స్థానం, హారిక 7వ స్థానం, అలాగే వరుసగా గౌతమి, కావేరి, నందిని, ప్రణవి, స్వాతి, చైతన్యశ్రీ, శ్రీ వర్షిని ,కీర్తన, ప్రతిభ కనబరిచి మెడల్స్, ప్రశంసా పత్రాలు పొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి, వైస్ ప్రిన్సిపల్ అపరంజి , పిడి అవంతి తెలిపారు. రాష్ట్రస్థాయి సైకిల్ పోటీలలో నైపుణ్యతను ప్రదర్శించిన సైకిల్ రైడర్స్ ను అందుకు కృషి చేసిన పిడి అవంతిని ఈ నెల 5న పాఠశాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి, ఘనంగా సన్మానించి అభినందించారు.

## భారత విద్యార్థుల కోసం కెనడా భారీ స్కాలర్‌షిప్ ఫండ్



100 మిలియన్ డాలర్లతో ఏటా 200 మందికి ఉపకార వేతనాలు టొరంటో యూనివర్సిటీ నిర్వహణలో పూర్తి విద్యా ఖర్చుల చెల్లింపు భారత్‌లో మూడు హైబ్రిడ్ స్టడీ సెంటర్లు, ఇన్నోవేషన్ క్యాంపస్‌ల ఏర్పాటు తిరుపతి ఐఐటీ, ఐసర్‌తో డల్హౌసీ యూనివర్సిటీ భాగస్వామ్యం కెనడాలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులకు ఆ దేశ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఏకంగా 100 మిలియన్ డాలర్ల (సుమారు రూ.921.6 కోట్లు) భారీ నిధితో స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. ఈ ఫండ్ ద్వారా ఏటా 200 మంది ప్రతిభావంతులైన భారతీయ విద్యార్థులను ఎంపిక చేసి, వారికి కోర్సు పూర్తయ్యేవరకు అయ్యే పూర్తి విద్యా ఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రఖ్యాత యూనివర్సిటీ ఆఫ్ టొరంటో నిర్వహిస్తుంది.ఇటీవల కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత పర్యటన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. 'కెనడా-భారత్ టాలెంట్ అండ్ ఇన్నోవేషన్ స్ట్రాటజీ'లో భాగంగా ఈ ఉపకార వేతనాల నిధిని ఏర్పాటు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ వ్యూహంలో భాగంగా భారత్‌లో మూడు ప్రాంతాల్లో హైబ్రిడ్ స్టడీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి అంశాలపై ఈ కేంద్రాల్లో బోధన, పరిశోధనలు జరుగుతాయి. వీటి ద్వారా కెనడా యూనివర్సిటీలు మన దేశంలో తమ కార్యకలాపాలను విస్తరించనున్నాయి.కార్నీ పర్యటన సందర్భంగా ఇరు దేశాల విద్యాసంస్థల మధ్య మొత్తం 13 ఒప్పందాలు కుదిరాయి. వీటిలో భాగంగా తిరుపతి ఐఐటీ, ఐసర్-తిరుపతి భాగస్వామ్యంతో డల్హౌసీ యూనివర్సిటీ మన దేశంలో ఓ ఇన్నోవేషన్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. అలాగే యూనివర్సిటీ ఆఫ్ టొరంటో, మెక్‌గిల్ వర్సిటీలు కూడా భారత్‌లో తమ ఎక్సలెన్స్ కేంద్రాలను నెలకొల్పనున్నాయి.

## 26 రకాల వివరాలతో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు: సీఎం చంద్రబాబు



అసెంబ్లీ చాంబర్‌లో ఎఫ్‌బీఎంఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష వివిధ శాఖల నుంచి సమాచారాన్ని సమీకృతం చేయాలని సూచనఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ సిద్ధం చేయనున్న అధికారులు26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలన్న సీఎం రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చేలా రూపొందిస్తున్న 'ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఎఫ్‌బీఎంఎస్)పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అసెంబ్లీలోని తన చాంబర్‌లో అధికారులతో ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ ఐడీ, ఆధార్, రైస్ కార్డ్, మొబైల్ నెంబర్, విద్యార్హతలు, వృత్తి, చిరునామా, వ్యవసాయ భూమి, ఇతర ఆస్తుల వివరాలు వంటి మొత్తం 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ఈ డేటాబేస్ రూపకల్పన కోసం ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, డిస్కమ్స్, పురపాలక శాఖ, వెబ్‌ల్యాండ్, వాహన్, హెచ్‌ఆర్‌ఎంఎస్, పంచాయతీరాజ్, మార్క్‌ఫెడ్ వంటి వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని సేకరించి ఇందులో పొందుపరచాలని సీఎం సూచించారు. ప్రస్తుతం 82 శాతం సమాచారం సిద్ధంగా ఉందని, వచ్చే ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ పూర్తిచేస్తామని అధికారులు వివరించారు.దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. ప్రభుత్వంలోని అన్ని శాఖల వద్ద ఉన్న డేటాను సమీకృతం చేయడం ద్వారానే సమాచారంలో కచ్చితత్వం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 'ఫ్యామిలీ కార్డు' అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దీనికి అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

## హిందుత్వం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్న బీఆర్ నాయుడు



అన్యమతస్తుల తొలగింపు నిర్ణయంతోనే తనపై కుట్రలు చేస్తున్నారని ఆరోపణ జగన్ భార్యతో కలిసి తిరుమలకు వస్తేనే జనం నమ్ముతారని స్పష్టీకరణ వైసీపీ అధినేత జగన్ పై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఆయన జగన్‌ను ప్రశ్నిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిందుత్వం గురించి గానీ, శ్రీవారి గురించి గానీ మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని ఆయన స్పష్టం చేశారు. ఇది జగమెరిగిన సత్యం అంటూ ఈ మేరకు ట్వీట్ చేశారు.“హిందుత్వం గురించి మాట్లాడే అర్హత నీకు లేదు. దేవదేవుడు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి గురించి నువ్వు మాట్లాడతావా జగన్..? ఆయన పేరు ఉచ్చరించే అర్హత, నైతికత నీకుందా? హిందూ వ్యతిరేకి అయిన నువ్వు సీఎంగా ఉన్నావనే కదా నీ అనుచరులకి ధైర్యం..! అందుకే వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి రెచ్చిపోయి హిందూ మత ఔన్నత్యాన్ని మంటగలిపారు. ఒక పథకం ప్రకారం తిరుమల కొండపై యథేచ్ఛగా అన్యమత ప్రచారం చేశారు. అన్యమతస్తుడవైన నువ్వు ఇప్పటివరకు దేవదేవునిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఎందుకు ఇవ్వలేదు? సీఎంగా ఉండగా నీ భార్యతో కలిసి గుడికి వచ్చి పట్టు వస్త్రాలిచ్చావా?... రాలేదే! నీ జీవితంలో నీ భార్యతో కలిసి తిరుమలకు రాలేవు.. ఎందుకంటే మీ ఇద్దరూ నమ్మేది ఏసుప్రభువునే కానీ, శ్రీ వేంకటేశ్వర స్వామిని కాదు కాబట్టి... ఇది ఒప్పుకో జగన్! నేను ఛైర్మన్ అయ్యాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల మేరకు టీటీడీని ప్రక్షాళన చేస్తున్నాం. నీ అండతో నీ బాబాయ్, భూమన చేసిన అవినీతి, అక్రమాలు బయట పడుతున్నాయనే నీ బాధంతా! టీటీడీలో అన్యమతస్తులు ఉండరాదని నేను నిర్ణయం తీసుకున్న నాడే నాపై పథకం ప్రకారం కుట్రలు ప్రారంభించావు. అందులో భాగంగానే కదా నాపై డీప్ ఫేక్ వీడియోలు సృష్టించి తిరుమల ప్రతిష్ఠ దెబ్బతీయాలని చూశావు. శ్రీ వేంకటేశ్వర స్వామిని ఇంటిదైవంగా పూజించే చంద్రబాబుకు దేవదేవునిపై భక్తి లేదంటావా?చంద్రబాబు భార్యతో తిరుమలకు వస్తారు. నువ్వు హిందువువే అయితే భార్యతో తిరుమలకు రా...! అప్పుడు నిన్ను నమ్ముతారు. కానీ నువ్వు సతీసమేతంగా రాలేవు... నిన్ను ఎవ్వరూ నమ్మరు జగన్!“ అంటూ బీఆర్ నాయుడు నిప్పులు చెరిగారు.

## ఖఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు ముఖ్యమంత్రిపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు



ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శ ఐపీఎస్, ఐఏఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారన్న హరీశ్ రావు రెండున్నరేళ్లలై దుసార్లు భారీ ఎత్తున బదిలీ చేశారన్న హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కలెక్టర్ల సదస్సులో ఆయన బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. రెండున్నరేళ్లలోనే ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను బదిలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోందని అన్నారు. పరిస్థితులను అర్థంచేసుకునే లోపే అధికారులను బదిలీ చేస్తున్నారని విమర్శించారు.జీహెచ్‌ఎంసీ కమిషనర్లు కూడా రెండున్నరేళ్లలో నలుగురు మారారని తెలిపారు. ముఖ్యమంత్రి లేదా మంత్రులకు నచ్చకపోతే ఆ అధికారులను వెంటనే బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. కొందరికి పోస్టింగులు ఇచ్చి జాయిన్ చేసుకోవడం లేదని విమర్శించారు. త్వరలో కాంగ్రెస్ నేతల అవినీతిని, బినామీలను బయటపెడతామని హెచ్చరించారు.

## మంత్రి నారా లోకేశ్ సూచనలతో ఫీడ్ బ్యాక్ కమిటీ ఏర్పాటు

**కార్యకర్తల నుంచి నేరుగా సమాచారం సేకరించేలా కొత్త వ్యవస్థ**
**మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశంతో ఫీడ్ బ్యాక్ కమిటీ ఏర్పాటు**
**మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు నేతృత్వంలో త్రిసభ్య బృందం**
**సోషల్ మీడియాలో బహిరంగ విమర్శలకు చెక్ పెట్టేలా కార్యాచరణ**
**అధిష్ఠానం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్న పార్టీ శ్రేణులు**



తెలుగుదేశం పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే దిశగా అధినాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేవలం పరిపాలనలోనే కాకుండా పార్టీ నిర్వహణలోనూ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. పార్టీకి వెన్నెముకగా నిలిచే కార్యకర్తల మనోభావాలను నేరుగా తెలుసుకునేందుకు, వారి సూచనలను పరిగణనలోకి తీసుకునేందుకు మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సూచనల మేరకు ప్రత్యేకంగా ఒక 'ఫీడ్ బ్యాక్ కమిటీ'ని ఏర్పాటు చేసింది. క్షేత్ర స్థాయి వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యం.పార్టీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్ ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు నేతృత్వంలో ఈ త్రిసభ్య కమిటీ ఏర్పాటైంది. కార్యకర్తలకు, నాయకత్వానికి మధ్య ఉన్న అగాధాన్ని తగ్గించి, సాధారణ కార్యకర్త అభిప్రాయం కూడా నేరుగా లీడర్‌కు చేరేలా ఈ వ్యవస్థ పని చేయనుంది. ఇటీవల కాలంలో కొందరు పార్టీ శ్రేణులు తమ అసంతృప్తిని లేదా పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తమ అభిప్రాయాలను బహిరంగంగా సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఇది పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించడమే కాకుండా, ప్రత్యర్థులకు ఆయుధంగా మారుతోందని అధిష్ఠానం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే పార్టీని ఒక కుటుంబంగా భావిస్తూ, సమస్యలను అంతర్గతంగానే చర్చించుకుని పరిష్కరించుకునేందుకు ఈ వేదికను అందుబాటులోకి తెచ్చారు.ఈ కొత్త విధానంలో భాగంగా కమిటీ తన పనిని వేగవంతం చేసింది. తాజాగా పామర్రు నియోజకవర్గానికి చెందిన, సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే ఒక కార్యకర్తతో ఈ ఫీడ్ బ్యాక్ కమిటీ ప్రత్యేకంగా భేటీ అయ్యింది. సదరు కార్యకర్త నుంచి క్షేత్ర స్థాయి పరిస్థితులు, పార్టీ బలోపేతానికి అవసరమైన సలహాలను కమిటీ సభ్యులు సావధానంగా విన్నారు. “పార్టీలో ఏవైనా లోపాలు ఉన్నా, లేదా మంచి సలహాలు ఇవ్వాలనుకున్నా సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దు. నేరుగా మా కమిటీ దృష్టికి తీసుకురండి. మీ అభిప్రాయాన్ని యథాతథంగా అధినాయకత్వానికి చేరవేస్తాం“ అని కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ రాజు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

## నకిలీ ఉద్యోగులను సృష్టించిన ఏజెన్సీలపై ఆడిట్ చేసి కేసులు పెట్టాలని ఆదేశం

**మార్చి 6 నుంచి 99 రోజుల పాటు**
**'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం**
**ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై కఠినంగా**
**లేకుంటే కలెక్టర్లపై చర్యలని హెచ్చరిక**



రాష్ట్రంలో సుమారు 25 వేల మంది బోగస్ ఉద్యోగులు ఉన్నారని, వారంతా కనీసం ఆధార్ కార్డు కూడా లేకుండా ఏళ్లుగా జీతాలు తీసుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఉన్న 1.70 లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఈ నకిలీ ఉద్యోగులను గుర్తించినట్లు తెలిపారు. ఇలాంటి బోగస్ ఉద్యోగులను సృష్టించి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై సమగ్ర ఆడిట్ చేయించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆయన తీవ్రంగా ఆదేశించారు. కలెక్టర్లు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని అమలు చేయడంపై ఆయన దిశానిర్దేశం చేశారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల భాగస్వామ్యంతో ఈ ప్రణాళికను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఈ నెల 12న జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నోడల్ అధికారిగా నియమించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు, హెచ్చరికలు జారీ చేశారు. ధాన్యం సేకరణలో మోసాలకు పాల్పడే మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని, వారి నుంచి ధాన్యాన్ని వెనక్కి రాబట్టాల్సిన పూర్తి బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలెక్టర్లు, ఎస్పీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.భూభారతి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, దానికి సంబంధించిన కార్యక్రమాలను ఒక వేడుక వాతావరణంలో జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## తిరుమలలో పట్టు శాలువాల స్కామ్ ఎఫెక్ట్.. టీటీడీ కీలక నిర్ణయం

**ఆప్కో, కోఆప్టెక్స్‌ల నుంచి వస్త్రాలు కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్**
**రూ.43 కోట్ల విలువైన వస్త్రాలను 50:50 నిష్పత్తిలో సేకరణ**
**సరఫరాలో అంతరాయం లేకుండా మల్టీ వెండార్ విధానం అమలు**
**కొనుగోళ్లలో పారదర్శకత, నాణ్యతకు పెద్దపీట వేసిన టీటీడీ**



తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వస్త్రాల కొనుగోలు విధానంలో కీలక నిర్ణయం తీసుకుంది. గతేడాది వెలుగులోకి వచ్చిన పట్టు శాలువాల కుంభకోణం నేపథ్యంలో ఇకపై కొనుగోళ్లలో పూర్తి పారదర్శకత పాటించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలైన ఆప్కో (ఆంధ్రప్రదేశ్), కోఆప్టెక్స్ (తమిళనాడు) నుంచి వస్త్రాలను సేకరించాలని తీర్మానించింది. మొత్తం రూ.43 కోట్ల విలువైన చీరలు, శాలువాలు, ఇతర వస్త్ర సామగ్రిని ఈ రెండు సంస్థల నుంచి 50:50 నిష్పత్తిలో కొనుగోలు చేయనుంది.సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేదా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే ఈ మల్టీ వెండార్ విధానాన్ని ఎంచుకున్నట్లు టీటీడీ స్పష్టం చేసింది. టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి ఇటీవల ఆప్కో, కోఆప్టెక్స్ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. టీటీడీ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతో వస్త్రాలను సరఫరా చేసేందుకు ఈ రెండు సంస్థలు అంగీకారం తెలిపాయి. ఈ నిర్ణయంతో ఇకపై స్వామివారికి, అమ్మవార్లకు అవసరమైన వస్త్రాలన్నీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని చేనేత సహకార సంఘాల నుంచే రానున్నాయి.గతేడాది టీటీడీలో పట్టు శాలువాల కుంభకోణం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. మల్బరీ పట్టు శాలువాల కోసం ఆర్డర్ ఇస్తే, ఓ ప్రైవేట్ సరఫరాదారు వాటికి బదులుగా నాసిరకం పాలిస్టర్ శాలువాలను సరఫరా చేసినట్లు టీటీడీ గుర్తించింది. సుమారు రూ.350 నుంచి రూ.400 విలువ చేసే శాలువాను ఏకంగా రూ.1,389 చొప్పున 2015 నుంచి కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై టీటీడీ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేయడంతో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే టీటీడీ భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది.కాగా, టీటీడీకి ఏటా భారీ మొత్తంలో వస్త్రాలు అవసరమవుతాయి. తిరుమల శ్రీవారి ఆలయానికి ఏటా దాదాపు 65 స్వచ్ఛమైన జరీ మేల్‌చాట్, ఉత్తరీయం సెట్లు, 1,080 పట్టు చీరలు అవసరం. అలాగే టీటీడీ పరిధిలోని ఇతర ఆలయాలకు 320 మేల్‌చాట్ సెట్లు, వందల సంఖ్యలో పట్టు చీరలు కావాలి. వీటికి అదనంగా ఏటా 36 వేల పట్టు శాలువాలు, 60 వేల పాలిస్టర్ శాలువాలు, 10.8 లక్షల కాటన్ వస్త్రాలు, 9 లక్షల కాటన్ బ్లౌజ్ పీసులు కూడా టీటీడీ సేకరిస్తుంది. ఈ భారీ అవసరాలన్నింటినీ ఇకపై ఆప్కో, కోఆప్టెక్స్‌లు సంయుక్తంగా తీర్చనున్నాయి

## ఆగని యుద్ధం.. ఆల్ టైం హైలో రూపాయి.. ఒక్క రోజులోనే ఇన్వెస్టర్లకు 8 లక్షల కోట్ల నష్టం

**కొనసాగుతున్న మార్కెట్ పతనం..**
**సెన్సెక్స్ 1,123 పాయింట్లు డౌన్**
**గత మూడు సెషన్లలో 4 శాతం పడిన సెన్సెక్స్, నిఫ్టీ**
**దాదాపు రూ.21 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి**




న్యూఢిల్లీ: మార్కెట్‌లో బ్లడ్‌బాత్ కొనసాగుతోంది. రోజురోజుకూ ఇన్వెస్టర్లు రూ.లక్షల కోట్లు నష్టపోతున్నారు. అమెరికా- ఇరాన్ యుద్ధం తీవ్రమవడంతో బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లు బుధవారం ఒకటిన్నర శాతం పడ్డాయి. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో 4 శాతం నష్టపోయాయి. ఇన్వెస్టర్లు ఒక్క బుధవారం సెషన్‌లోనే దాదాపు రూ.8 లక్షల కోట్లు నష్టపోగా, గత మూడు సెషన్లలో రూ.21 లక్షల కోట్లు కోల్పోయారు.యుద్ధం 4-5 వారాలు కొనసాగుతుందని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ ప్రకటించడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. 50 రోజులకు సరిపడా క్రూడాయిల్ స్టాక్స్ ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ మార్కెట్ పతనం ఆగలేదు. సెన్సెక్స్ బుధవారం 1,123 పాయింట్లు (1.40శాతం) తగ్గి 79,116.19 వద్ద ముగియగా, నిఫ్టీ 385.20 పాయింట్లు (1.55శాతం) నష్టపోయి 24,480.50 వద్ద సెటిల్ అయింది. నిఫ్టీ ఇంట్రాడేలో 24,300 వరకు జారింది. చివరి గంటలో ఐటీ షేర్లలో బయ్యింగ్ రావడంతో కొంత కోలుకుంది.మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు 2శాతం చొప్పున పడ్డాయి. క్రూడాయిల్ ధరలు పెరగడంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు హెచ్‌పీసీఎల్, ఐఓసీ, బీపీసీఎల్ షేర్లు 5 శాతం వరకు నష్టపోయాయి. షాలిమార్ పెయింట్స్, బెర్జర్ పెయింట్స్, ఇండిగో పెయింట్స్, ఏషియన్ పెయింట్స్ షేర్లు కూడా 2.5 శాతం వరకు పడ్డాయి. ఐటీ తప్ప మిగిలిన సెక్టార్ల ఇండెక్స్‌లు రెడ్‌లో ముగిశాయి. నిఫ్టీ ఇన్‌ఫ్రా, పీఎస్‌యూ బ్యాంక్, రియల్టీ, మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, మెటల్ ఇండెక్స్‌లు 2-4శాతం వరకు క్రాష్ అయ్యాయి. 700 కి పైగా స్టాక్స్ 52- వారాల కనిష్టానికి జారుకున్నాయి.

### ఎనలిస్టులు ఏమంటున్నారు

“ఒక్కసారిగా సెల్లింగ్ రావడంతో నిఫ్టీ 24,300-24,100 సపోర్ట్ జోన్‌కు పడిపోయింది. గ్యాప్-డౌన్ ఓపెనింగ్ తర్వాత రికవరీకి ప్రయత్నాలు జరిగాయి. గ్రీన్ క్యాండిల్ ఏర్పడింది. బుల్స్ రిలీఫ్ ర్యాలీ కోసం ప్రయత్నిస్తున్నారు. సపోర్ట్ 24,300--24,100 వద్ద, రెసిస్టెన్స్ 24,600 వద్ద ఉంది'అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ టెక్నికల్ ఎనలిస్ట్ నాగరాజ్ శెట్టి తెలిపారు.“ మెటల్ ఇండెక్స్ 4శాతం పడింది. నిఫ్టీ 24,300 నుంచి 24,600 రేంజ్‌లో ట్రేడ్ అయింది. షార్ట్-టర్మ్‌లో వీక్‌గా కనిపిస్తున్నా, ఓవర్‌సోల్డ్ జోన్‌లో ఉంది. సపోర్ట్ 24,300 దగ్గర, రెసిస్టెన్స్ 24,600 వద్ద ఉంది. రెసిస్టెన్స్ లెవెల్ దాటితే 24,800-25,000 వరకు, సపోర్ట్ కోల్పోతే 24,100-24,000 వరకు కదలొచ్చు. వోలటాలిటీ ఎక్కువగా ఉంటుంది'అని కోటక్ సెక్యూరిటీస్ ఎనలిస్ట్ శ్రీకాంత్ చౌహాన్ వివరించారు. కాగా, ఇన్వెస్టర్ల భయాన్ని కొలిచే వోలటాలిటీ ఇండెక్స్ నిఫ్టీ విక్స్ బుధవారం 23 శాతం పెరిగి 21.14 కి చేరింది.

### రూపాయి.. ఆల్ టైం లో

స్టాక్ మార్కెటే కాదు రూపాయి కూడా వరుస సెషన్లలో క్షీణిస్తోంది. డాలర్‌తో మొదటిసారిగా 92 లెవెల్‌ను దాటి బుధవారం ఆల్ టైమ్ లోని నమోదు చేసింది. రూపాయి విలువ 56 పైసలు బలహీనపడి 92.05 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 92.35 వరకు కూడా జారింది. అమెరికా ఇరాన్‌పై కిందటి నెల 28న దాడులు ప్రారంభించగా అంతకుముందు రోజు రూపాయి 91.08 దగ్గర ఉంది. బుధవారం నాటికి దాదాపు100 పైసలు నష్టపోయింది. ఇది సుమారు 1.1-1.2 శాతానికి సమానం.

ఇరాన్ సంక్షోభం వల్ల బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 82 డాలర్లకు చేరాయి. దీంతో రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు ఫారిన్ ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐలు) ఇండియా మార్కెట్ నుంచి వెళ్లిపోతుండడంతో మన కరెన్సీ క్షీణిస్తోంది. ఎఫ్ఐఐలు బుధవారం నికరంగా రూ.8,752 కోట్ల విలువైన షేర్లను అమ్మారు. రూపాయి సోమవారం 41 పైసలు తగ్గి 91.49 వద్ద ముగిసింది.

# రోదసిలో నిఘా యుద్ధం!

## అంతరిక్షంలో ఉపగ్రహాలతో దేశాల నిఘా యుద్ధం
## వైరి దేశాల శాటిలైట్లపై దృష్టి సారించిన వైనం



జేమ్స్‌బాండ్ సినిమాల్లో హీరో అలవోకగా ఖండాలన్నీ చుట్టేస్తుంటాడు. చట్టవ్యతిరేక, విద్రోహ సంస్థల గుట్టుమట్లు రట్టుచేసి భారీ ఉపద్రవాలను అడ్డుకుంటాడు. శత్రువుల రహస్య స్థావరాలను నేలమట్టం చేస్తుంటాడు. ఈ నిఘా పోరు 21వ శతాబ్దపు వాస్తవిక ప్రపంచంలో భూమిని దాటేసి ఏకంగా అంతరిక్షానికి చేరింది! ఇంతకాలం నేలల తేమ శాతం, అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు తదితరాలపై అధ్యయం చేస్తూ వచ్?చన ఉపగ్రహాలు నిఘా కార్యకలాపాల్లో తలమునకలు అవుతున్నాయి. వైరి దేశాల ఉపగ్రహాలపై కన్నేస్తున్నాయి. ఏ సమయంలో ఏ దేశంపై ఎందుకు తిరగాడుతున్నాయో కూపీ లాగుతున్నాయి. ప్రధాన దేశాలన్నీ దాదాపుగా ఇదే బాటపట్టడంతో ఇప్పుడు అంతరిక్షంలో సరికొత్త శాటిలైట్ నిఘా యుద్ధానికి తెర లేచింది. బెంగళూరుకు చెందిన దిగంతర సంస్థ ఒకటి ఇటీవల ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్?కకు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ల జాడను విజయవంతంగా కనిపెట్టడం తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన అజిస్టా స్పేస్ సంస్థ ఏకంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం( ఐఎస్ఎస్) ఎప్పుడు, ఎక్కడ తిరుగుతోందో కనిపెట్టి ఔరా అనిపించింది. వీటిని ఒకరకంగా ఇతర ఉపగ్రహాలపై నిఘా ఘటనలుగానే చెప్పొచ్చు. శత్రు ఉపగ్రహాల జాడను కనిపెట్టేందుకు సరికొత్త 'స్పేస్ సిచ్యువేషనల్ అవేర్‌నెస్' (ఎస్ఎస్ఏ) పరిజ్ఞానం ఇప్పుడు కీలకంగా మారింది. రెండు ఉపగ్రహాలు పొరపాటున ఢీకొనే ఆస్కారాన్ని తప్పించడమే గాక వాటి సిగ్నళ్లను జామ్ చేయడం, శాటిలైట్‌ను ధ్వంసం చేయడాన్ని నిలువరించడం కోసం ముందు ప్రత్యర్థి ఉపగ్రహాలు ఎక్కడున్నాయో కనీసం పక్కాగా తెలిసి ఉండాలి. ఈ కారణంగా కూడా నింగిలో నిఘా నేత్రాన్ని తెరవాల్సిన అనివార్యత దేశాలకు ఏర్పడిందని ఇండియన్ స్పేస్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) ఏకే భట్ అన్నారు. ఈ నేపథ్యంలో 'స్పైయింగ్ ఇన్ స్కై' ఇప్పుడిక ఎంతమాత్రమూ సైన్స్‌ఫిక్షన్ స్థాయికి పరిమితం కాలేదు. భూమిపై జేమ్స్‌బాండ్ చేసి పనినే ఇప్పుడు ఆకాశంలో కృత్రిమ ఉపగ్రహాలు విస్తృతస్థాయిలో చేయబోతున్నాయి. ఇందులో ఆధిపత్యం ఎవరితో భవిష్యత్తులో తేలిపోనుంది.

### ఎవరు గమనిస్తున్నారో తెలిసుండాలి

"కమ్యూనికేషన్, సైనిక, పౌర, పరిశోధనావసరాల కోసం ఉపగ్రహాలను ప్రయోగిస్తున్నా అవి రహస్య పనులనూ చేస్తున్నాయి. ఇతర దేశాల ఉపగ్రహాలు భారత్‌లోని ఏఏ భూభాగాలపై ఎందుకు తిరుగుతున్నాయో కచ్?చతంగా మనకు తెల్సి ఉండాల్సిందే. ఇది నిఘా, వ్యూహాత్మక ఆపరేషన్లకు అత్యంత కీలకం. అందుకే శత్రు దేశాల ఉపగ్రహాలపై నిఘా పెట్టాల్సిన అవసరం ఏర్పడింది" అని అజిస్టా స్పేస్‌లో స్పేస్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ విభాగ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ భరత్ సింహా రెడ్డి చెప్పారు.

"ఉక్రెయిన్--రష్యా యుద్ధం మొదలు ఆపరేషన్ సిందూర్‌దాకా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ్?దలకు కీలక సమాచారం ఉపగ్రహాల నుంచే అందింది. కమ్యూనికేషన్స్, ఇంటెలిజెన్స్, నేవిగేషన్, టార్గెట్ ఇలా అన్ని విభాగాలను పటిష్టంచేయడంలో శాటిలైట్లే కీలక పాత్ర పోషించాయి" అని దిగంతర సీఈఓ, వ్యవస్థాపకులు అనిరుధ్ శర్మ అన్నారు.

### సామర్థ్యాన్ని పెంచుకుంటున్న భారత్

స్పేస్ సిచ్యువేషనల్ అవేర్‌నెస్ (ఎస్ఎస్ఏ)లో ప్రైవేట్ భాగస్వాములను ప్రోత్సహిస్తూ భారత్ అంతర్జాతీయ నిఘా సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. ఏటా ఆరు నుంచి పది ఉపగ్రహాలను తయారు చేసేలా అజిస్టా సంస్థ కొత్త ఎలక్ట్రో--ఆప్టికల్ పేలోడ్ తయారీ కర్మాగారాన్ని నిర్మిస్తోంది. ఇది 2027 ద్వితీయార్ధంలోపు ప్రారంభం కావచ్చు. శత్రువులు ప్రయోగించే క్షిపణుల జాడను శాటిలైట్ ద్వారా గుర్తించే కొత్త ఉపగ్రహాన్ని 2027లోపు ప్రయోగిస్తామని ఈ సంస్థ తెలిపింది. అంతరిక్షంలో అర్లీ వార్?నంగ్ సిస్టమ్‌ను ఇది మరింత పటిష్టపరచనుంది. సాంప్రదాయకంగా భూతలంపై రాడార్ వ్యవస్థలు, ఆకాశంలో చక్కర్లు కొట్టే నిఘా విమానాలకు తోడుగా ఇప్పుడు అంతరిక్షంలోనూ నిఘా ఉపగ్రహాల రాకతో భారత రక్షణ వ్యవస్థ మరింత పటిష్టం కాబోతోంది.

# దేశంలో 40% మందిలో ఫ్యాటీ లివర్!

## విస్మయకర గణాంకాలు బయటపెట్టిన లాన్సెట్ నివేదిక



స్పెషల్ డెస్క్: దేశంలో కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడే వారి సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరుగుతోంది. దాదాపు 40 శాతం మంది భారతీయులు ప్రస్తుతం ఫ్యాటీ లివర్ (కొవ్వు పేరుకుపోయిన కాలేయం) సమస్యను ఎదుర్కొంటున్నారని తాజా అధ్యయనం వెల్లడించింది. భారతీయులలో తక్కువ బరువు ఉన్నప్పటికీ పొత్తికడుపు భాగంలో ఎక్కువగా కొవ్వు పేరుకుపోయి ఉంటోందని.. ఇది శరీరంలో ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తోందని నివేదిక పేర్కొంది. మద్యపానం అలవాటు లేని వారిలోనూ ఈ వ్యాధి కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

### అధ్యయనంలో తేలిన అంశాలివీ..


లాన్సెట్ (ఆగ్నేయాసియా) జర్నల్‌లో ప్రచురితమైన ఫెనోమ్ ఇండియా అధ్యయనం ప్రకారం.. దేశవ్యాప్తంగా 2023 డిసెంబర్ నుంచి 2024 జూన్ మధ్య 27 నగరాల్లో జరిపిన పరిశోధనలో సుమారు 38.9 శాతం మందిలో ఆల్కహాల్‌తో సంబంధం లేని మెటబాలిక్ డిస్‌ఫంక్షన్-అసోసియేటెడ్ స్టీటోటిక్ లివర్ డిసీజ్ (ఎంఏఎస్ఎల్‌డీ) ఉన్నట్లు తేలింది. కాలేయం గట్టిపడటం లేదా మచ్చలు పడటం (ఫైబ్రోసిస్) ముప్పు సాధారణ వ్యక్తుల్లో 1.7% మందిలో ఉంది. ఇప్పటికే ఎంఏఎస్ఎల్‌డీ సమస్య ఉన్నవారిలో లివర్ ఫైబ్రోసిస్ 6.3 శాతం మందిలో.. అంటే దాదాపు 4 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. మొత్తంగా 2.4 శాతం మందిలో ఫైబ్రోసిస్ లక్షణాలు కనిపించాయి.

### సైలెంట్ కిల్లర్..

గతంలో నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌గా పిలిచే ఈ సమస్యను ఇప్పుడు ఎంఏఎస్-ఎల్‌డీగా పిలుస్తున్నారు. ఆందోళనకరమైన విషయం ఏమిటంటే ఈ సమస్య ఉన్న వారిలో చాలా మందికి తమ కాలేయం దెబ్బతింటోందనే విషయం ప్రాథమిక దశలో తెలియదు. ఈ వ్యాధి కాలేయాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఎంఏఎస్ఎల్‌డీ కాలేయాన్ని మాత్రమే ప్రభావితం చేయదు. టైప్--2 డయాబెటిస్, గుండెజబ్బులు, మూత్రపిండాల సమస్యలకు దారితీస్తోంది. దేశ జనాభాలో గణనీయమైన శాతం మందిలో లివర్ ఫైబ్రోసిస్ లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇది కాలేయం గట్టిపడే (స్కారింగ్) ప్రక్రియకు ప్రారంభ దశ. దీన్ని గమనించకుండా నిర్లక్ష్యం చేస్తే అది కాలక్రమేణా కాలేయం పూర్తిగా దెబ్బతినే సిర్రోసిస్ లేదా ప్రాణాంతక కాలేయ కేన్సర్‌కు దారితీసే ప్రమాదాన్ని పెంచుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దేశ జనాభా విస్తృతిని, వేగంగా పెరుగుతున్న మధుమేహం, స్థూలకాయం కేసులను పరిగణనలోకి తీసుకుంటే ఫ్యాటీ లివర్ రోగుల స్థాయి ఆందోళనకరమని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. మధుమేహం, స్థూలకాయం, రక్తపోటు వంటి జీవక్రియ సంబంధిత సమస్యలే ఫ్యాటీ లివర్‌కు ప్రధాన మూలాలని పరిశోధకులు స్పష్టం చేశారు. సరైన జీవనశైలి, పౌష్టికాహారం, క్రమం తప్పకుండా వ్యాయామంచేయడం ద్వారా దీనిని నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



# ఆల్‘ఇంటి’యా రేడియో!




వన్స్ అ పాన్ ఏ టైమ్ రేడియో అంటే... ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ కాదు. మన కుటుంబసభ్యురాలు! ?ద్దుటే సుప్రభాతంతో నిద్ర లేపి, ప్రపంచంలో, దేశంలో ఏ మూలన ఏం జరుగుతుందో చెప్పి, బుర్ర హీటెక్కి పోకుండా చల్లని పాటలు వినిపించి... ఒక్కటా రెండా... రేడియో అంటే అంతులేని అపురూపమైన జ్ఞాపకాల సంపద....

### ఆకాశవాణి--రజని

మన ఆకాశవాణిని జనరంజకం చేసిన వారిలో బాలాంత్రపు రజనీకాంతరావు ఒకరు. ఆకాశవాణిలో స్వరకర్తగా, గీతరచయితగా, సంచాలకునిగా పలు బాధ్యతలు నిర్వహించారు. లలిత సంగీతాన్ని ఆకాశవాణి వేదికగా జనరంజకం చేశారు. 1947 ఆగస్ట్ 15 భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి, ప్రధాని నెహ్రూ ప్రసంగం తరువాత రజని రచించి, స్వర పరిచిన 'మాదీ స్వతంత్రదేశం' ప్రసారం అయింది.

99%: ఆకాశవాణిగా ప్రసిద్ధమైన ఆల్ ఇండియా రేడియో (ఏఐఆర్) ప్రపంచంలో అతి పెద్ద ప్రసార సంస్థలలో ఒకటి. 23 భాషలలో, 179 మాండలికాలలో మన దేశంలోని 99 శాతం మందికి చేరువైంది.

ఆకాశవాణి -- ఆధ్యాత్మికం -- ఉషశ్రీ

రామాయణ, భారత, భాగవతాలను ఆకాశవాణి వేదికగా సామాన్యులకు చేరువ చేశారు ఉషశ్రీ. భగవద్గీత, సుందరకాండలను అందరికీ అర్థమయ్యేలా చెప్పారు. ఆయన నిర్వహించిన 'ధర్మసందేహాలు' కార్యక్రమం చాలా జనాదరణ పొందింది. పౌరాణికాలకు సంబంధించి ఎంత జటిలమైన విషయాన్ని అయినా సులభంగా అర్థమయ్యేలా చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి.

1923: బాంబే రేడియో క్లబ్ కార్యక్రమాలతో 1923లో ప్రసారాలు ప్రారంభమయ్యాయి. మొదటి న్యూస్ బులెటిన్ జనవరి 19, 1936లో ప్రసారం అయింది.

ఆకాశవాణి--మహానటి

మహానటి సావిత్రి సమర్పించిన జనరంజని ప్రత్యేక కార్యక్రమం 1979లో ఉగాది రోజున ప్రసారం అయింది.

సిగ్నేచర్ ట్యూన్ శివరంజని

శివరంజని రాగం ఆధారంగా వాల్టర్ కౌఫ్‌మన్ ఆల్ ఇండియా రేడియో సిగ్నేచర్ ట్యూన్‌ను స్వరపరిచారు. వయోలిన్‌పై వాయించారు.

జనం మెచ్చిన జనరంజని

శ్రోతలు కోరిన పాటల కార్యక్రమం 'జనరంజని' అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమాలలో ఒకటి. ఆదివారాలు, పండగ రోజుల్లో ప్రత్యేక జనరంజని

కార్యక్రమాలు ప్రసారమయ్యేవి.

బారిష్టర్ పార్వతీశం రాకతో రేడియో నవ్వింది!

మొక్క పాటి ప్రసిద్ధ హాస్య నవల 'బారిష్టర్ పార్వతీశం' ఆకాశవాణిలో అత్యంత ప్రజాదరణ పొందిన నాటకాల్లో ఒకటి.

రేడియోలో వేటూరి

విజయవాడ కేంద్రం ద్వారా ప్రసారమైన వేటూరి సంగీత రూపకం 'సిరికాకొలను చిన్నది' అద్భుతమైన ఆడియో నాటిక. ఈ సంగీతక రూపకానికి పెండ్యాల నాగేశ్వరరావు సంగీతం అందించారు.

థీమ్ 2026

ఈ సంవత్సరం 'వరల్డ్ రేడియో డే' థీమ్...'రేడియో అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: ఏఐ ఈజ్ ఏ టూల్, నాట్ ఏ వాయిస్'

# ఉత్కంఠను దాటి.. ఆఖరాటకు

## టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్
## రసవత్తర సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై విజయం
## మెరిసిన శాంసన్
## ఒత్తిడిలో బుమ్రా సూపర్ బౌలింగ్
## 253 చేసినా.. చెమటోడ్చిన టీమ్‌ఇండియా
## బెతెల్ రనౌట్‌తో భారత జట్టు సంబరం



టీమ్‌ఇండియా అదరహో! వరుసగా రెండోసారి టీ20 ప్రపంచకప్‌ను అందుకోవడానికి.. ముచ్చటగా మూడోసారి పొట్టి కప్పును ముద్దాడడానికి.. సొంతగడ్డపై తొలిసారి టీ20 విశ్వవిజేతగా నిలిచేందుకు .. భారత్ వేయాల్సింది ఇంకొక్క అడుగే. వాంఖడేలో సూర్య బృందం సత్తా చాటింది. కోట్లాది అభిమానులను ఉర్రూతలూగిస్తూ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సంజు శాంసన్, బుమ్రా భారత్ హీరోలు.

పరుగుల వరద పారిన వాంఖడేలో ఎంత ఉత్కంఠో!

శాంసన్ వీరవిహారంతో కొండంత లక్ష్యాన్ని నిర్దేశించిన టీమ్‌ఇండియాకు విజయం అంత తేలికగా దక్కలేదు. ప్రతిఘటన తప్పలేదు. బెతెల్ అద్భుత పోరాటంతో ఇంగ్లిష్ జట్టు.. డిఫెండింగ్ ఛాంపియన్‌ను కలవరపెట్టింది. ఓడించినంత పనిచేసింది. కానీ తీవ్ర ఒత్తిడిలో బుమ్రా ఎప్పటిలాగే అద్భుతంగా బౌలింగ్ చేశాడు. జోరు మీదున్న ఇంగ్లాండ్ బ్యాటర్లకు కళ్లెం వేస్తూ.. భారత్ గట్టెక్కడంలో కీలక పాత్ర పోషించాడు. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌ను టీమ్‌ఇండియా ఢీకొంటుంది.

ముంబయి : టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టింది. సంజు శాంసన్ (89; 42 బంతుల్లో 8x4, 7x6) మెరుపు ఇన్నింగ్స్‌కు బుమ్రా (1/33) అద్భుత బౌలింగ్ తోడు కావడంతో గురువారం ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్లో 7 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను మట్టికరిపించింది. శాంసన్‌తో పాటు శివమ్ దూబె (43; 25 బంతుల్లో 1x4, 4x6), ఇషాన్ కిషన్ (39; 18 బంతుల్లో 4x4, 2x6) కూడా బ్యాట్ ఝళిపించడంతో మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది. భారీ ఛేదనలో బెతెల్ (105; 48 బంతుల్లో 8x4, 7x6) గొప్పగా పోరాడినా ఇంగ్లాండ్‌కు ఓటమి తప్పలేదు. ఆ జట్టు 7 వికెట్లకు 246 పరుగులే చేసింది. బుమ్రాతో పాటు హార్దిక్ (2/38) కూడా ఇంగ్లాండ్‌ను అడ్డుకోవడంలో తన వంతు పాత్రను పోషించాడు. వరుణ్ చక్రవర్తి (1/64) మరోసారి నిరాశపరిచాడు. అర్ష్‌దీప్ (1/51) కూడా ధారాళంగా పరుగులిచ్చాడు.



బెతెల్ 105

భయపెట్టిన బెతెల్: ఇంగ్లాండ్ ముందు కొండంత లక్ష్యం. ఆ జట్టు ధాటిగానే ఆరంభించినా.. భారత్ కూడా దెబ్బతీసింది. చకచకా మూడు వికెట్లు పడగొట్టింది. సాల్ట్ (5)ను హార్దిక్, బ్రూక్ (7)ను బుమ్రా, బట్లర్ (25)ను వరుణ్ ఔట్ చేశారు. ఇంగ్లాండ్‌ను ఆరు ఓవర్లలో 68/3కు పరిమితం చేసిన భారత్.. మ్యాచ్‌పై పట్టు సాధించినట్లే కనిపించింది. కానీ ఇంగ్లాండ్ అంత తేలికగా వదల్లేదు. విధ్వంసక బ్యాటింగ్‌తో భారత్‌ను భయపెట్టింది. బెతెల్ ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు బాదేస్తూ స్కోరు బోర్డును ఉరకలెత్తించాడు. జట్టు స్కోరు 95 వద్ద బాంటన్ (17)ను అక్షర్ ఔట్ చేసినా.. జాక్స్ రూపంలో మరో చక్కని భాగస్వామి దొరకడంతో బెతెల్ నిర్దాక్షిణ్యమైన బ్యాటింగ్‌ను కొనసాగించాడు. జాక్స్ కూడా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. స్పిన్నర్లు వరుణ్, అక్షర్‌లను వీళ్లు అలవోకగా ఎదుర్కొన్నారు. 13.5 ఓవర్లలో 172/4తో ఇంగ్లాండ్ తిరుగులేని స్థితిలో నిలిచింది. భారత్ తీవ్ర ఒత్తిడిలో పడ్డ ఆ దశలో.. ఇంగ్లాండ్ విజయావకాశాన్ని సృష్టించుకుంది. ఆ స్థితిలో అక్షర్ పటేల్ అద్భుత ఫీల్డింగ్, దూబె క్యాచ్‌తో జాక్స్ వెనుదిరగడంతో ప్రమాదకర భాగస్వామ్యానికి తెరపడింది. అది ఉపశమనాన్నిచ్చినా భారత్‌పై ఒత్తిడి తగ్గలేదు. జోరుమీదున్న బెతెల్.. సామ్ కరన్ (18) అండగా వేట కొనసాగించాడు. అర్ష్‌దీప్ దారాళంగా పరుగులివ్వడంతో ఇంగ్లాండ్ పని తేలికైంది. కానీ బుమ్రా అద్భుత బౌలింగ్‌తో భారత్‌ను గట్టెక్కించాడు. 16వ ఓవర్లో 8 పరుగులే ఇచ్చిన అతడు.. తర్వాతి ఓవర్లో అర్ష్‌దీప్ 16 పరుగులిచ్చి జట్టును ఇబ్బందిలో నెట్టాక మళ్లీ గొప్పగా బౌలింగ్ చేశాడు. బెతెల్, కరన్‌లకు కళ్లెం వేస్తూ 18వ ఓవర్లో 6 పరుగులు మాత్రమే ఇచ్చాడు. అయితే అక్కడితో అతడి బౌలింగ్ కోటా పూర్తయింది. ఆఖరి రెండు ఓవర్లలో 39 పరుగులు అవసరమైనా.. బెతెల్ క్రీజులోనే ఉండడంతో ఇంగ్లాండ్ రేసులోనే ఉంది. 19వ ఓవర్లో హార్దిక్ తొలి బంతికే సిక్స్ కొట్టి బెతెల్ సెంచరీ పూర్తి చేశాడు. అయితే హార్దిక్ తర్వాతి అయిదు బంతుల్లో మూడు పరుగులే ఇచ్చి కరన్‌ను వెనక్కి పంపాడు. ఆఖరి ఓవర్లో (దూబె) ఇంగ్లాండ్‌కు 30 పరుగులు అవసరం కాగా.. తొలి బంతికే బెతెల్ రనౌటయ్యాడు. తర్వాతి రెండు బంతుల్లో దూబె రెండు పరుగులే ఇవ్వడంతో భారత్ విజయం ఖాయం కాగా.. చివరి మూడు బంతులకు ఆర్చర్ సిక్సర్లు బాదేశాడు.



సంజు శాంసన్ 89

సంజు ధనాధన్: టీమ్‌ఇండియా భారీ స్కోరు సాధించిందంటే ప్రధాన కారణం శాంసన్ అదిరే బ్యాటింగే. చెలరేగి ఆడిన అతడు.. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నందుకు ఇంగ్లాండ్ చింతించేలా చేశాడు. మరో ఓపెనర్ అభిషేక్ మాత్రం పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ రెండో ఓవర్లోనే పెవిలియన్ బాట పట్టాడు. కానీ శాంసన్ జోరును అతడి నిష్క్రమణ ఆపలేకపోయింది. పేసర్ ఆర్చర్ ఊహించినట్లే షార్ట్ బంతులతో అతణ్ని పరీక్షించాడు. కానీ ఆ బంతులను శాంసన్ అలవోకగా ఎదుర్కొన్నాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లో అతడి షార్ట్ బంతికి ఫైన్ లెగ్‌లోకి సిక్స్ కొట్టి అభిమానులను ఉర్రూతలూగించాడు. ఆర్చర్ స్లో బంతులకూ శాంసన్ పడలేదు. 15 పరుగుల వ్యక్తిగత స్కోరు బ్రూక్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన శాంసన్.. అవకాశాన్ని పూర్తిగా అందిపుచ్చుకున్నాడు. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు కొడుతూ సాగిపోయాడు. 26 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు ఇషాన్ కిషన్ కూడా చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. 9వ ఓవర్లోనే స్కోరు వంద దాటింది. తర్వాతి ఓవర్లో ఇషాన్ ఔట్ కావడంతో 97 పరుగుల భాగస్వామ్యానికి తెరపడ్డా.. దూబెతో కలిసి మరో విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు శాంసన్. శాంసన్‌తో పాటు దూబె కూడా ధాటిగా ఆడడంతో 13 ఓవర్లలో 160/2తో భారత్ తిరుగులేని స్థితిలో నిలిచింది. తర్వాతి ఓవర్లో శాంసన్ నిష్క్రమించినా.. దూబె, తిలక్ (21), హార్దిక్ (27) బ్యాట్ ఝళిపించడంతో ఆఖరి అయిదు ఓవర్లలో భారత్ 86 పరుగులు రాబట్టింది.

భారత్ ఇన్నింగ్స్: శాంసన్ (సి) సాల్ట్ (బి) జాక్స్ 89; అభిషేక్ శర్మ (సి) సాల్ట్ (బి) జాక్స్ 9; ఇషాన్ కిషన్ (సి) జాక్స్ (బి) రషీద్ 39; దూబె రనౌట్ 43; సూర్యకుమార్ (స్టంప్డ్) బట్లర్ (బి) రషీద్ 11; హార్దిక్ రనౌట్ 27; తిలక్ వర్మ (బి) ఆర్చర్ 21; అక్షర్ పటేల్ నాటౌట్ 2; వరుణ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 12 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 253; వికెట్ల పతనం: 1-20, 2-117, 3-160, 4-190, 5-212, 6-236, 7-251; బౌలింగ్: ఆర్చర్ 4-0-61-1; జాక్స్ 4-0-40-2; ఒవర్టన్ 3-0-36-0; సామ్ కరన్ 4-0-53-0; అడిల్ రషీద్ 4-0-41-2; డాసన్ 1-0-19-0

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) అక్షర్ (బి) హార్దిక్ 5; బట్లర్ (బి) వరుణ్ 25; బ్రూక్ (సి) అక్షర్ (బి) బుమ్రా 7; బెతెల్ రనౌట్ 105; బాంటన్ (బి) అక్షర్ 17; జాక్స్ (సి) దూబె (బి) అర్ష్‌దీప్ 35; సామ్ కరన్ (సి) తిలక్ వర్మ (బి) హార్దిక్ 18; ఒవర్టన్ నాటౌట్ 2; ఆర్చర్ నాటౌట్ 19; ఎక్స్‌ట్రాలు 13 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 246; వికెట్ల పతనం: 1-13, 2-38, 3-64, 4-95, 5-172, 6-222, 7-225; బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-51-1; హార్దిక్ 4-0-38-2; బుమ్రా 4-0-33-1; వరుణ్ చక్రవర్తి 4-0-64-1; అక్షర్ పటేల్ 3-0-35-1; దూబె 1-0-22-0

"బుమ్రాదే గెలుపు ఘనత. అతడు ప్రపంచ స్థాయి బౌలర్. తరానికొక్కడు. ఈ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అతడికే దక్కాలి. క్లిష్టమైన పరిస్థితుల్లో డెత్ ఓవర్లలో అతడు అద్భుతంగా బౌలింగ్ చేశాడు"

సంజు శాంసన్

499

ఈ మ్యాచ్‌లో భారత్, ఇంగ్లాండ్ కలిపి చేసిన పరుగులు. టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక రన్స్ నమోదైన మ్యాచ్ ఇదే.

## విద్యార్థులు మొదటి బోర్డు పరీక్షలకు హాజరు కావడం తప్పనిసరి





న్యూఢిల్లీ : పదవ తరగతి విద్యార్థులు మొదటి బోర్డు పరీక్షలకు హాజరు కావడం తప్పనిసరని 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ)' సోమవారం స్పష్టం చేసింది. మొదటి బోర్డు పరీక్షల్లో కనీసం మూడు సబ్జెక్టులను కూడా రాయని వారిని 'ఎసెన్షియల్ రిపీట్' కేటగిరీలో ఉంచుతామని అధికారులు తెలిపారు. పదవతరగతి విద్యార్థులకు 2026 నుండి రెండు బోర్డు పరీక్షలను నిర్వహించనున్నట్లు సిబిఎస్ఇ ప్రకటించిన సంగతి తెలిసిందే. కొన్ని ప్రత్యేక కారణాలతో మొదటి బోర్డు పరీక్ష రాయలేని విద్యార్థులను రెండవ బోర్డు పరీక్ష రాసేందుకు అనుమతించాలంటూ వచ్చిన అభ్యర్థనలపై సిబిఎస్ఇ పై విధంగా స్పందించింది. "మొదటి బోర్డు పరీక్షకు విద్యార్థులంతా హాజరుకావడం తప్పనిసరి. ఉత్తీర్ణులైన మరియు అర్హత కలిగిన విద్యార్థులందరూ సైన్స్, మ్యాథ్స్, సోషల్, లాంగ్వేజెస్‌లోని మూడు సబ్జెక్టుల్లో దేనిలోనైనా తమ పనితీరును మెరుగుపరుచుకోవడానికి అనుమతి ఉంటుంది" అని సిబిఎస్ఇ పరీక్షల అధికారి సంయమ్ భరద్వాజ్ పేర్కొన్నారు. ఒక విద్యార్థి మొదటి బోర్డు పరీక్షల్లో మూడు లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టుల్లో హాజరుకాకపోతే, ఆ విద్యార్థిని రెండవ బోర్డు పరీక్షకు హాజరయ్యేందుకు అనుమతించమని, వారిని 'ఎసెన్షియల్ రిపీట్' విభాగంలో ఉంచుతామని పేర్కొన్నారు. ఆ విద్యార్థులు వచ్చే ఏడాది (2027 ఫిబ్రవరి) నిర్వహించే ప్రధాన బోర్డు పరీక్షల్లో మాత్రమే పరీక్షలు రాయగలరని అన్నారు.

## ఏప్రిల్ 7న సమీక్ష, విచారణ చేపట్టనున్న రాజ్యాంగ ధర్మాసనం



న్యూఢిల్లీ : కేరళలోని శబరిమల ఆలయంలోకి 10-50 మధ్య వయస్సు గల మహిళలు ప్రవేశించడానికి అనుమతిస్తూ ఇచ్చిన తీర్పుపై సమీక్ష, రిట్ పిటిషన్‌ల విచారణను సుప్రీంకోర్టు సోమవారం తొమ్మిదిమంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. రాజ్యాంగ ధర్మాసనం ఏప్రిల్ 7న వాటిపై విచారణ చేపట్టనుంది. 10-50మధ్య వయస్సు గల మహిళలను ప్రవేశానికి అనుమతిస్తూ 2018 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. 2019లో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే నియమించిన తొమ్మిది మంది జడ్జీల ధర్మాసనం సమీక్ష పిటిషన్‌ల విచారణను నిర్ణయించిందని ప్రస్తుత సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కొవిడ్ మహమ్మారి కారణంగా ధర్మాసనం ఎదుట జాబితా చేసిన విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందని తెలిపింది. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత, శబరిమల కేసు మొదటిసారి విచారణకు వచ్చింది. అప్పటిరాజ్యాంగ ధర్మాసనంలో తొమ్మిది మంది జడ్జీలతో కూడిన అప్పటి ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ మాత్రమే మిగిలి ఉన్నారు. ఈ కేసు విచారణకు సుప్రీంకోర్టు 2026 ఏప్రిల్‌లో కొంత సమయాన్ని ఇచ్చింది. 2018 తీర్పును సవాలు చేస్తూ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌లను ఏప్రిల్ 7 నుండి 9 వరకు విచారిస్తుంది. వాటిని వ్యతిరేకించే వారి వాదనలను ఏప్రిల్ 14-16 వరకు విచారిస్తుంది. 2019 నవంబర్‌లో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గొగోరు నేతృత్వంలోని ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన మెజారిటీ తీర్పు, శబరిమల సమీక్ష మరియు రిట్ పిటిషన్లను ఏడుగురు జడ్జీల ధర్మాసనానికి నివేదించింది.

## ప్రజల జీవితాల్లో ఆర్టీజీఎస్ ప్రత్యక్ష మార్పు తీసుకొస్తోంది



ఉండవల్లి (గుంటూరు) : పరిపాలనలో వేగాన్ని, వ్యాపార సౌలభ్యాన్ని ఆర్టీజీఎస్ అందిస్తోందని, ప్రత్యక్షంగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. మానవ జీవనాన్ని మెరుగుపరిచేందుకు సేవ చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సోమవారం సందర్శించిన విషయం తెలిసిందే. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆయన పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు చంద్రబాబు వివరించారు. ఈ మేరకు చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. " 1990లో బిల్ గేట్స్‌ను కలిసినప్పుడు సాంకేతికత ద్వారా పౌరసాధికారత సాధ్యమనే స్ఫూర్తి వచ్చింది. నాటి ఆలోచనలే ఇవాళ టెక్నాలజీ ఆధారిత పరిపాలనకు బాటలు వేశాయి. ఆర్టీజీఎస్ ద్వారా ఇవాళ పలు కార్యక్రమాల ప్రదర్శన సంతోషంగా ఉంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. బిల్‌గేట్స్ పర్యటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందిస్తూ .... ఎపి ప్రభుత్వంతో భాగస్వామ్యానికి గేట్స్ ఫౌండేషన్ చూపుతున్న నిబద్ధతకు అభినందనలు తెలిపారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల బలోపేతానికి గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం సంతోషంగా ఉందన్నారు. సమగ్ర స్థిర అభివఅద్ధి కోసం ఫౌండేషన్ సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోందని పవన్ తెలిపారు. సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు.

## కరీంనగర్ మేయర్ అభ్యర్థిని ప్రకటించిన బిజెపి



తెలంగాణ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల సందడి ముగింపుకు చేరుకుంది. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటలకు ఘనంగా ప్రారంభమయ్యింది. అనంతరం మధ్యాహ్నం 12 గంటల 30 నిముషాల నుండి అత్యంత కీలకమైన మేయర్లు, ఛైర్మన్ల ఎన్నిక ప్రక్రియను 'చేతులెత్తే' పద్ధతిలో నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిని బిజెపి అధిష్ఠానం ఖరారు చేసింది. మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా సునీల్‌రావు పేర్లను పార్టీ ప్రతిపాదించింది. ఈ మేరకు ఇప్పటికే ఎన్నికల అధికారికి సమాచారం అందించారు. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ తన పట్టును నిరూపించుకుంది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా వాకిటి మానస, వైస్ ఛైర్మన్‌గా బాయికాటి శైవిరెడ్డి పేర్లను పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఉదయం 11:00 గంటలకు.... కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం జరగనుంది. మధ్యాహ్నం 12:30 గంటలకు... మేయర్లు, ఛైర్మన్ల ఎంపిక కోసం ప్రత్యేక సమావేశం జరగనుంది. ఆ తరువాత ఎన్నికైన ప్రతినిధులతో బాధ్యతల స్వీకరణ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ తమ అభ్యర్థులను ఖరారు చేస్తూ ఎన్నికల అధికారులకు బి-ఫారాలను అందజేస్తున్నాయి. కొన్ని చోట్ల స్వతంత్ర అభ్యర్థులు కింగ్ మేకర్లుగా మారే అవకాశం ఉండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

# డబ్బుఉందా? డెబిట్! లేదా క్రెడిట్!

### స్వైప్ ఒకటే.. స్టైల్ రెండు
### భారత్‌లో డెబిట్-కమ్-క్రెడిట్ కార్డు చెల్లింపుల్లో కొత్త ట్రెండు
### ఒకే 16 అంకెల నంబర్‌తో డెబిట్, క్రెడిట్ రెండూ
### డిజిటల్ పేమెంట్స్‌లో 'ఫ్లెక్సిబుల్' అడుగు`వీసా కార్డు గేమ్‌చేంజర్




భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరో కీలక మలుపు తీసుకుంటోంది. అంతర్జాతీయ చెల్లింపుల దిగ్గజం వీసా త్వరలో భారత్‌లో ఒకే కార్డుతో అటు డెబిట్‌కి, ఇటు క్రెడిట్‌కి రెండు విధాలుగా ఉపయోగపడేలా 'డెబిట్--కమ్--క్రెడిట్ కార్డు'ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ కొత్త విధానం వినియోగదారులకు సౌకర్యాన్ని పెంచడమే కాకుండా, దేశంలో క్రెడిట్ వినియోగాన్ని విస్తరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

#### యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డులతో పోలిస్తే

ప్రస్తుతం భారత్‌లో యూపీఐ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, అది ప్రధానంగా బ్యాంక్ సేవింగ్స్ ఖాతా నుంచి నేరుగా డబ్బు కట్ అయ్యే విధానమే. డెబిట్ కార్డులు కూడా ఖాతాలో డబ్బు ఉంటేనే పనిచేస్తాయి. మరోవైపు, క్రెడిట్ కార్డులు సౌకర్యవంతమే అయినా వాటి వినియోగం డిజిటల్ రూపంలో,యూపీఐ చెల్లింపుల విషయంలో ఇంకా పరిమితంగానే ఉంది. ఈ నేపథ్యంలో వీసా తీసుకొస్తున్న కొత్త కార్డు యూపీఐతో అందే సౌలభ్యం, డెబిట్ కార్డుతో చేయగల నియంత్రణ, క్రెడిట్ కార్డు ఫ్లెక్సిబిలిటీ ఈ మూడింటినీ కలిపిన ఉపయోగకరమైన సాధనంగా మారనుందని విశ్లేషకులు అంటున్నారు.

#### బ్యాంకులు, వినియోగదారులకు లాభాలు

ఈ కొత్త విధానం ద్వారా బ్యాంకులు తమ రిస్క్ పాలసీలకు అనుగుణంగా క్రెడిట్ వినియోగాన్ని నియంత్రించగలుగుతాయి. వినియోగదారులకు మాత్రం ఒకటి కంటే ఎక్కువ కార్డులని ప్రతిచోటుకూ మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. ముఖ్యంగా స్థిర ఆదాయం ఉన్నా క్రెడిట్ కార్డు లేని మధ్య తరగతి వర్గానికి ఇది ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.

#### ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

నిపుణుల అంచనాల ప్రకారం, ఈ విధానం నగదు వినియోగాన్ని తగ్గించడంలో, టైర్--2, టైర్--3 నగరాల్లో కార్డు వినియోగాన్ని పెంచడంలో, ఫార్మల్ ఎకానమీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే, అతిగా క్రెడిట్ వినియోగం వల్ల వినియోగదారుడు అప్పుల ఊబిలో కూరుకునే ప్రమాదం కూడా ఉందని, అందుకే ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వీసా ప్రతిపాదిస్తున్న ఈ డెబిట్--కమ్--క్రెడిట్ కార్డు భారత్ చెల్లింపుల వ్యవస్థను మరింత స్మార్ట్‌గా, ఫ్లెక్సిబుల్‌గా మార్చే విధానంగా పరిగణించవచ్చు. ఇది వినియోగదారుల సౌకర్యం, బ్యాంకులకు భద్రత ఈ రెండింటికీ మధ్య సమతుల్యత తీసుకురావచ్చని విశ్లేషకుల అభిప్రాయం.

#### కార్డు కాదు కాంబోప్యాక్

వీసా అభివృద్ధి చేసిన 'ఫ్లెక్సిబుల్ క్రెడెన్షియల్ (వీసా ఫ్లెక్స్) ' టెక్నాలజీ ఆధారంగా ఈ కార్డు పనిచేస్తుంది. 16 అంకెల ఒకే కార్డు నంబర్ ద్వారా కస్టమర్ లావాదేవీ చేసే సమయంలో అది అవసరాన్ని బట్టి డెబిట్‌గా లేదా క్రెడిట్‌గా వాడుకోవచ్చు. చెల్లింపు ఎలా జరగాలన్నది కస్టమర్ కొనుగోలు చేసే విలువ మొత్తం, లేదా వినియోగదారు ముందుగా ఎంచుకున్న సెట్టింగ్స్ ఆధారంగా ఆటోమేటిక్‌గా నిర్ణయమవుతుంది.ఉదాహరణకు, రోజువారీ చిన్న ఖర్చులు డెబిట్‌గా, పెద్ద కొనుగోళ్లు క్రెడిట్‌లో జరిగేలా ఈ కార్డును సెట్ చేసుకోవచ్చు.

#### భారత్ ఎందుకు కీలక మార్కెట్?

భారత్‌లో క్రెడిట్ కార్డు వినియోగం అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే తక్కువ. అదే సమయంలో నగదు లావాదేవీల వాటా చాలా పెద్దది. ఈ పరిస్థితిలో ఒకే కార్డు ద్వారా డెబిట్--క్రెడిట్ సౌకర్యం ఇవ్వడం వల్ల డిజిటల్ చెల్లింపులు మరింత విస్తరించవచ్చని వీసా భావిస్తోంది.

# కొన్ని క్యాన్సర్లను నివారించొచ్చు

### 38% కేసులకు ముందస్తుగా అడ్డుకట్ట
### ఏటా 71 లక్షల మందిని కాపాడవచ్చు
### ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడి

స్పెషల్ డెస్క్: క్యాన్సర్.. ప్రపంచాన్ని వణికిస్తున్న అత్యంత భయంకరమైన వ్యాధి. ఏటా ఒక కోటి మంది ఈ వ్యాధి బారినపడి కన్నుమూస్తున్నారంటే ముప్పు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి కొత్త క్యాన్సర్ కేసుల్లో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ నివారించదగినవే. అంటే ఏటా 71 లక్షల మందిని ఈ మహమ్మారి బారిన పడకుండా కాపాడవచ్చన్నమాట. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) శాస్త్రవేత్తల నివేదిక ప్రకారం.. 2022లో 1.87 కోట్ల మందికి కొత్తగా క్యాన్సర్ సోకింది. ఇందులో సుమారు 38% కేసులు ఇన్ఫెక్షన్లు (అంటువ్యాధులు), జీవనశైలి అలవాట్లు, పర్యావరణ కాలుష్య కారకాల వల్ల సంభవించాయని అంచనా. ఇవన్నీ నివారించదగినవే. హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే గర్భాశయ క్యాన్సర్లను సకాలంలో టీకాలు వేయడం ద్వారా అడ్డుకోవచ్చు. అలాగే స్మోకింగ్ వల్ల కలిగే అనేక కణితులను ధూమపానం మాన్పించడం ద్వారా చెక్ పెట్టవచ్చు. ఇలా లక్షలాది మంది ప్రజల జీవితాలను మార్చడానికి 'శక్తివంతమైన అవకాశం'ఉందని పరిశోధకులు అంటున్నారు.

#### కొన్ని క్యాన్సర్లు అనివార్యం..

వయసు పెరిగే కొద్దీ మన డీఎన్ఏలో అనివార్యంగా జరిగే నష్టం లేదా వ్యాధి వచ్చే ప్రమాదాన్ని పెంచే జన్యువులు వారసత్వంగా రావడం వల్ల కొన్ని క్యాన్సర్లు అనివార్యం. అయితే 10లో దాదాపు నాలుగు కేసులను నివారించవచ్చన్న అంశం జనంలో ఆసక్తి రేకెత్తిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే 30 నివారించగల కారకాలను డబ్ల్యూహెచ్ఓలో భాగమైన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ అనే సంస్థ విశ్లేషించింది. ధూమపానం, అతినీలలోహిత (అల్ట్రావయోలెట్) కిరణాలు వీటిలో ఉన్నాయి. ఇవి మన డీఎన్ఏను నేరుగా




దెబ్బతీస్తాయి. ఊబకాయం, శరీరంలో వాపు, హార్మోన్లను మార్చే అతి తక్కువ శారీరక శ్రమ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతోంది. వాయు కాలుష్యం వల్ల నిద్రాణమైన క్యాన్సర్ కణాలు మేల్కొంటాయని ఏజెన్సీ వెల్లడించింది.

#### ధూమపానం ప్రధాన కారణం

క్యాన్సర్‌కు దారితీసే తొమ్మిది ఇన్ఫెక్షన్లను కూడా ఏజెన్సీ నివేదించింది. వీటిలో హెచ్‌పీవీ, కాలేయ క్యాన్సర్‌కు దారితీసే హెపటైటిస్ వైరస్‌లు, కడుపు నొప్పి, అల్సర్స్, తీవ్రమైన గ్యాస్ సమస్యలకు కారణం అయ్యే హెలికోబాక్టర్ పైలోరి బ్యాక్టీరియా ఉన్నాయి. పరిశోధన బృందం 2022 నుండి 36 రకాల క్యాన్సర్ కేసుల డేటాను.. అలాగే 185 దేశాలలో 2012--22 మధ్య ఈ వ్యాధికి మూలమైన 30 ప్రమాద కారకాల సమాచారాన్ని విశ్లేషించి నివేదికను రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక క్యాన్సర్ కేసులకు ధూమపానం ప్రధాన కారణమని వెల్లడించింది. ఆ తరువాతి స్థానాల్లో ఇన్ఫెక్షన్లు, మద్యపానం ఉన్నాయి. భవిష్యత్తులో క్యాన్సర్ భారాన్ని తగ్గించుకోవడానికి ప్రమాద కారకాలను నివారించడం అత్యంత శక్తివంతమైన మార్గాలలో ఒకటి అని పరిశోధన వెల్లడించింది.

#### దేశాలకు అనుగుణంగా..

పురుషుల క్యాన్సర్లలో 45% నివారించదగినవిగా ఉండగా.. మహిళల్లో ఇది 30% ఉంది. నివారణ స్థాయి పురుషులలో అధిక స్థాయిలో ఉండడానికి కారణం.. ధూమపాన ప్రియులు పురుషుల్లో ఎక్కువగా ఉండడమే. యూరప్‌లో నివసించే మహిళల్లో క్యాన్సర్ దరి చేరకుండా ఫుల్‌స్టాప్ పెట్టే మొదటి మూడు కారణాల్లో ధూమపానం, ఇన్ఫెక్షన్లు, ఊబకాయం ఉన్నాయి. సబ్--సహారా ఆఫ్రికాలో మహిళల్లో నివారించగల క్యాన్సర్లలో ఇన్ఫెక్షన్ల వాటా దాదాపు 80% ఉంది. అంటే ఈ క్యాన్సర్లను పరిష్కరించడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తీసుకునే చర్యలు ప్రతి ప్రాంతం లేదా దేశానికి అనుగుణంగా ఉండాలని నివేదిక వివరించింది.

#### సగం వాటా వాటిదే..

నేచర్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ నివేదిక ప్రకారం ధూమపానం, వాయు కాలుష్యంతో ఊపిరితిత్తుల క్యాన్సర్, హెలికోబాక్టర్ పైలోరి ఇన్ఫెక్షన్‌తో ముడిపడి కడుపు క్యాన్సర్, హ్యూమన్ పాపిలోమా వైరస్‌తో గర్భాశయ క్యాన్సర్.. నివారించగల మొత్తం క్యాన్సర్ కేసుల్లో ఇవి దాదాపు సగం ఉంటాయి. ధూమపాన నియంత్రణ, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టిన దేశాల్లో క్యాన్సర్ కేసులు తగ్గాయని నివేదిక తెలిపింది. ధూమపానం ప్రపంచవ్యాప్తంగా పురుషుల్లో అతిపెద్ద ముప్పుగా పరిణమించింది.

#### మహిళల్లో 30% నివారించవచ్చు..

నివేదిక ప్రకారం.. మహిళల్లో 92 లక్షల కొత్త క్యాన్సర్ కేసుల్లో సుమారు 30% నివారించవచ్చు.

సబ్ సహారా ఆఫ్రికా వంటి తక్కువ, మధ్యస్థాయి ఆదాయ దేశాల్లో సర్రై?వకల్ క్యాన్సర్ కేసులు అధికం.

అధిక ఆదాయ దేశాలైన ఉత్తర అమెరికా, యూరప్‌లో మహిళల్లో క్యాన్సర్‌కు స్మోకింగ్ ప్రధాన కారణం.

పురుషుల్లో 43 లక్షల నివారించదగ్గ క్యాన్సర్ కేసుల్లో 25% ధూమపానం కారకంగా నిలిచింది.

ఇన్ఫెక్షన్‌తో కూడిన క్యాన్సర్ కేసులు పురుషుల్లో ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికాలో ఎక్కువ.

# స్పామ్ కాల్స్.. ఇక బ్లాక్!

### ఫిర్యాదుల అవసరం లేకుండానే నిషేధం
### స్పామ్ నంబర్‌గా టెల్కోలు గుర్తిస్తే చర్యలు
### కసరత్తు చేస్తున్న టెలికం నియంత్రణ సంస్థ




అవాంఛిత, మోసపూరిత కాల్స్, సందేశాలు ప్రపంచానికి సవాల్‌గా మారాయి. వ్యక్తుల భద్రతకు ముప్పుగా పరిణమించడంతోపాటు ఆర్థిక నష్టాలకూ ఇవి కారణం అవుతున్నాయి. మన దేశంలో 95% మంది మొబైల్ యూజర్లకు ప్రతిరోజూ స్పామ్ కాల్స్, సందేశాలు వెల్లువెత్తుతున్నాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు టెలికం నియంత్రణ సంస్థ (ట్రాయ్) సిద్ధమవుతోంది. కస్టమర్ అందుకున్న కాల్, మెసేజ్‌ను టెలికం కంపెనీ స్పామ్‌గా గుర్తిస్తే ఆ నంబర్‌ను బ్లాక్ లిస్టులోకి చేర్చాలని భావిస్తోంది. అలాగే అధికారిక ఫిర్యాదు లేకపోయినా స్పామ్ మెసేజ్‌లు పంపే మొబైల్ నంబర్‌ను డిస్‌కనెక్ట్ చేయాలన్న ప్రతిపాదనపై ట్రాయ్ కసరత్తు చేస్తోంది. టెలికం కంపెనీలతో ఈ మేరకు చర్చిస్తోంది. ప్రస్తుతం టెల్కోలు 10 రోజుల వ్యవధిలో ఐదు ప్రత్యేక ఫిర్యాదులను స్వీకరిస్తే స్పామర్‌పై చర్య తీసుకుంటున్నాయి. తాజా ప్రతిపాదన ప్రకారం ఒక నంబర్‌ను వరుసగా 10 రోజులపాటు అనుమానిత స్పామ్‌గా ఏఐ టెక్నాలజీ గుర్తిస్తే.. ఆ నంబర్‌కు వ్యతిరేకంగా ఎటువంటి ఫిర్యాదు లేకపోయినా కూడా చర్య తీసుకోవచ్చు. ఇది అమల్లోకి వస్తే స్పామ్ కాల్స్, మెసేజెస్ కట్టడికి టెలికం కంపెనీలు చేపడుతున్న చర్యలకు మరింత ఊతం ఇచ్చి?చనట్టు అవుతుంది.

#### రియల్ టైమ్‌లో విశ్లేషించి..

ప్రస్తుతం దేశంలో ఏదైనా అవాంఛిత సమాచారాన్ని స్పామ్‌గా గుర్తించడానికి నిర్దిష్ట నియమాలు లేవు. కాల్స్, సందేశాలు పంపినవారి రోజువారీ వినియోగ తీరు, కాల్స్ ఎంత సమయం మాట్లాడుతున్నారు, ఎన్ని సందేశాలు పంపిస్తున్నారు, ఎవరెవరికి, ఏ ప్రాంతంలో ఉన్నవారికి ఈ కాల్స్ చేస్తున్నారు వంటి అంశాలను టెల్కోలు ఉపయోగిస్తున్న ఏఐ సాంకేతికత రియల్ టైమ్‌లో విశ్లేషించి.. అవాంఛిత కాల్స్, మెసేజెస్‌ను గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నాయి. కాల్‌ను అంగీకరించడం లేదా తిరస్కరించడం అనేది కస్టమర్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. అయితే అనుమానిత స్పామ్‌గా గుర్తించిన అనేక కాల్స్ నిజమైన కాలర్ల నుంచి వచ్చి?చనవే ఉంటున్నాయి. వాటిలో గిగ్ వర్కర్లతోపాటు ఇతర వాణిజ్య సంస్థలు ఉన్నాయి.

#### వ్యవస్థీకృతంగా మోసాలు..

2024 సెపట?టంబర్ నుంచి 2026 జనవరి మధ్య 7,100 కోట్ల స్పామ్ కాల్స్, 290 కోట్ల స్పామ్ సందేశాలను గుర్తించినట్లు ఎయిర్‌టెల్ ప్రకటించింది. 8 లక్షలకుపైగా మోసపూరిత లింక్స్‌ను బ్లాక్ చేసినట్లు వెల్లడించింది. సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ కాల్ సెంటర్లతో వ్యవస్థీకృతంగా మోసపూరిత కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా రూ. 92.7 లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ రెగ్యులేటరీ ఆఫీసర్ రాహుల్ వాట్స్ వెల్లడించారు. 250కిపైగా కొలమానాలను పరిగణనలోకి తీసుకొని స్పామ్ కాల్స్, సందేశాలను గుర్తిస్తున్నట్టు చెప్పారు.

టెల్కోలు ఏఐ సొల్యూషన్స్ సాయంతో ప్రతి నెలా సుమారు 40 కోట్ల కాల్స్, సందేశాల ను అనుమానిత స్పామ్‌గా గుర్తిస్తున్నాయి.

నమోదు కాని టెలీమార్కెటర్ల నుంచి వస్తున్న వాటిలో 7.5 కోట్ల కాల్స్, ఎస్ఎంఎస్‌లు ప్రతిరోజూ బ్లాక్ అవుతున్నాయి.

స్పామర్లపై టెల్కోలకు రోజుకు సగటున 10,000 ఫిర్యాదులు మాత్రమే అందుతున్నాయని సమాచారం.

2025 ఫిబ్రవరిలో 1,16,213 స్పామ్ ఫిర్యాదులు టెల్కోలకు అందగా 2025 డి సెంబర్‌లో ఆ సంఖ్య 3,34,317కు చేరింది.

ఫిర్యాదులలో ఎక్కువ భాగం నమోదు కాని టెలిమార్కెటర్లపైనే ఉంటున్నాయి.

టెలిమార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు సాధారణంగా 10 అంకెల మొబైల్ నంబర్ ద్వారా కాల్స్ చేస్తున్నారు.

భారత్‌లో 116 కోట్ల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. వారిలో అవాంఛిత కాల్స్‌ను నివారించేందుకు ట్రాయ్ తీసుకొచ్చి?చనడు నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) సేవలను 22 కోట్ల మంది మాత్రమే ఎంపిక చేసుకున్నారు.

# సీతమ్మ ఎగ్జిట్ తో యామీ గౌతమ్ సీన్లోకి!



బాలీవుడ్ డైరెక్టర్ ఆనంద్ ఎల్ . రాయ్ ధనుష్, కృతి సనన్ జంటగా 'తేరే ఇష్క్ మే' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇదొక రొమాంటిక్ లవ్ స్టోరీ. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. - ఆత్రాంగిరే - తర్వాత ధనుష్ తో ఆనంద్ తెరక్కిస్తోన్న మరో చిత్రం కావడంతో? ఈరేంజ్ బజ్ క్రియేట్ అవుతోంది. - గుడ్ లక్ జెర్రీ -, -% రక్షాబంధన్ - లాంటి సినిమాల వైఫల్యం తర్వాత ఆనంద్ ఎల్ . రాయ్ నుంచి రిలీజ్ అవుతోన్న చిత్రమిది. దీంతో ఈ సినిమాతో ఎలాగైనా కంబ్యాక్ అవ్వాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టే మార్కెట్లో బజ్ నెలకొంది. కాగా ఈ సినిమా సెట్స్ ఉండగానే ఆనంద్ మరో ప్రాజెక్ట్ కూడా సెట్ చేస్తున్నారు. - నయి నవేలీ - అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. భారతీయ జానపద కథలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన హారర్ కామెడీ కథగా తెలుస్తోంది. ఇందులో హీరోయిన్ గా కృతిసనన్ ఎంపికైంది. తేరే ఇష్క్ మే%-%లో కృతి పెర్ఫార్మెన్స్ చూసి మరోసారి హీరోయిన్ ఛాన్స్ తనకే ఇచ్చాడు ఆనంద్. అయితే ఇప్పుడా ప్రాజెక్ట్ నుంచి కృతిసనన్ అనూహ్యంగా తప్పుకుంది. ఆమె ఎందుకు ఎగ్జిట్ అయిందన్నది తెలియదు గానీ ..మరో ఆలోచన లేకుండా రాయ్ అదే పాత్రకు యామీ గౌతమ్ ని ఎంపిక చేసారు. కృతి కంటే ఇప్పుడా పాత్రకు యామీ పర్ఫెక్ట్ గా సూటవుతుందని చిత్ర వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో కృతిసనన్-ఆనంద్ ఎల్ రాయ్ మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ ఏవైనా తలెత్తాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరి అసలు కారణం ఏంటి? అన్నది తెలియాలి. ఈ ఏడాది చివరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టాలని రాయ్ టీమ్ ప్లాన్ చేస్తోంది. ఇంతలోనే కృతి సనన్ తప్పుకోవడం..ఆమె స్థానంలోకి యామీ గౌతమ్ రావడం అంతా వేగంగా జరిగిపోయాయి. ప్రస్తుతం యామీ సక్సెస్ పరంగా మంచి స్వింగ్ లో ఉంది. %-%ఆర్టికల్ 370%-, -%ఓఎమ్ జీ 2%-% లాంటి శక్తివంతమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిం చింది. త్వరలో - హక్ - అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇంతలోనే ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో నటించే అరుదైన అవకాశం ఒడిసి పట్టుకుంది.

# ఉగాదికి 'ఉస్తాద్..'





ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'గా థియేటర్లలో సందడి చేయనున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని హరీశ్ శంకర్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 26న థియేటర్లలోకి రావాల్సి ఉండగా.. ఇప్పుడు దీన్ని ఓ వారం ముందుగానే ఉగాది సందర్భంగా 19న విడుదల చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. వచ్చే రెండు వారాల్లో రానున్న వరుస సెలవుల ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్రబృందం తెలిపింది. 'గబ్బర్ సింగ్' విజయం తర్వాత పవన్ - హరీశ్ కలయికలో వస్తున్న చిత్రం కావడంతో ఇప్పటికే దీనిపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు ముగింపు దశలో ఉన్నాయి. త్వరలోనే ట్రైలర్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తుండగా.. తమన్ నేపథ్య సంగీతమందిస్తున్నారు



# చీరకట్టుతో చెమటలు పట్టిస్తున్న బేబమ్మ..
# ఇంత సోయగాన్ని ఎలా మిస్ అయ్యాం?

కన్నడ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న కృతి శెట్టి తొలిసారి.. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సన దర్శకుడిగా మారి తొలి ప్రయత్నంలో చేసిన 'ఉప్పెన' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమాలో బేబమ్మ పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది కృతి శెట్టి. మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా, కృతి శెట్టి హీరోయిన్గా వచ్చిన ఈ సినిమా అతి తక్కువ సమయంలోనే 100కోట్ల క్లబ్లో చేరి సంచలనం సృష్టించింది. ఇద్దరికీ ఇది తొలి చిత్రమైనా.. తమ నటనతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్నారు. ఈ సినిమా తర్వాత నానితో శ్యామ్ సింగరాయ్, నాగచైతన్యతో బంగార్రాజు వంటి చిత్రాలు చేసి హ్యాట్రిక్ సొంతం చేసుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన మొదట్లోనే హ్యాట్రిక్ అందుకున్న హీరోయిన్గా కూడా రికార్డు సృష్టించింది కృతి శెట్టి. ఆ తర్వాత పలు సినిమాలలో అవకాశాలు లభించాయి. కానీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయింది. అందులో భాగంగానే వరుస పరాజయాలు తలుపు తట్టడంతో కొంతకాలం ఇండస్ట్రీకి కూడా దూరమైంది ఇప్పుడిప్పుడే మళ్లీ తనను తాను కం బ్యాక్ చేసుకోవాలని చూస్తున్న కృతి శెట్టి.. ఇటు సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులను అలరిస్తోంది. మొదట్లో పద్ధతిగా కనిపించి, ఆ తర్వాత గ్లామర్ డోస్ పెంచిన ఈమె తన అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈసారి ఏకంగా చీరకట్టుతోనే చూసే ఆడియన్స్ కు చెమటలు పట్టించేసింది కృతి శెట్టి. తాజాగా ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు ఇన్ని రోజులు ఇంత అందాన్ని ఎలా మిస్ అయ్యాం అంటూ కామెంట్లు చేస్తున్నారు. శారీ విషయానికి వస్తే.. ఎంబ్రాయిడరీ నెట్టెడ్ లైట్ ఆరెంజ్ కలర్ తో డిజైన్ చేసిన చీరను కట్టుకొని , అందుకు కాంబినేషన్లో స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించింది. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన బ్లౌజ్ లో తన ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా జుట్టును వదులుగా వదిలేసి సింపుల్ జువెలరీ తో తన మేకోవర్ ను ఫినిష్ చేసింది. ఇందులో నడుము, ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు, అటు ఫేస్ ఎక్స్ప్రెషన్స్ కి కుర్రకారు ఫిదా అయిపోతున్నారు. పైగా ఈ ఫోటోలకు దేశి గర్ల్ వైబ్స్ అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ముఖ్యంగా ఈమె అందాలను చూసి ఏఐ జనరేటర్ లాగా ఉంది అని



కామెంట్లు చేస్తుంటే.. మరికొంతమంది లవ్, ఫైర్, స్మైల్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఇంకొంతమంది నువ్వే నా జాన్ అని కామెంట్లు పెడుతున్నారు. ఇలా ఎవరికి వారు తమ ప్రేమను ఒలకబోస్తూ కృతి శెట్టి ఫోటోలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కృతి శెట్టి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ ముద్దుగుమ్మ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తమిళంలో ఒక సినిమాలో నటిస్తోంది.





# విద్యార్థులకు సమంత విలువైన సలహా!

చదువు పేరుతో పిల్లలపై పాఠశాలలు, కళాశాలల ఒత్తిడి ఎక్కువవుతోందన్నది వాస్తవం. ర్యాంకుల కోసం బట్టి పట్టించే తీరు మారాలని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా? అవి అక్కడికే పరిమితమవుతున్నాయి. ఇళ్ల వద్ద తల్లిదండ్రులు కూడా ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో? పలు సూచనలు సలహాలు సైతం ప్రభుత్వాలు జారీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా నటి సమంత ఈ అంశంపై మాట్లాడింది. జీవితానికి మంచి మార్కులు, గ్రేడులే ముఖ్యం కావని మానవతా విలువలు కూడా అంతే అవసరమన్నారు. చదువుతో పాటు మంచి విలువలు ఉండేలా పిల్లలకు అన్ని రకాల విద్యలు నేర్పించాలన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సమయం దొరకడం లేదని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని విద్యార్థులకు సూచించారు. తాను విద్యార్థిగా ఉండి చాలా కాలమైందని.. కానీ ప్రస్తుతం విద్యార్థుల పడుతోన్న బాధలు, ఇబ్బందుల గురించి పత్రికల్లో , సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు చూస్తుంటే గుండె తరుక్కు పోతుందన్నారు. పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారనిపిస్తుందన్నారు. తాను స్కూల్ చదువుకుంటోన్న రోజుల్లో అలాంటివి ఏవీ లేవనిస్నేహం, దయ, సానుభూతి, ఇతరుల పట్ల గౌరవం వంటి లక్షణాలే తనకు జీవితంలో ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. మంచి మనిషిగా ఎలా ఉండాలో పాఠశాల నేర్పిస్తుందన్నారు. అప్పుడు నేర్చుకున్నవే జీవితంలో ఎలా ముందుకు వెళ్లాలో సహకరిస్తాయంది. జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదరైనా నిలబడే ధైర్యాన్ని కూడా పాఠశాల దశ నుంచే పిల్లలు అలవాటు చేసుకోవాలన్నారు. ఇలాంటి అంశాలతో కూడిన పాఠ్యాంశాలను జోడిస్తే బాగుంటుందన్నారు. 2023 లో దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. మహారాష్ట్రలో అత్యధికంగా కేసులు నమోదయ్యాయని గుర్తు చేసారు. సమంత సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా ఉంటారన్న సంగతి తెలిసిందే. సొంతంగా చారిటీలను కూడా నిర్వహిస్తున్నారు. అనాథశ్రమాలు, పిల్లలను చదివించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.ప్రస్తుతం సమంత నటిగా సినిమాలు చేయని సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో వెబ్ సిరీస్ లకు పని చేస్తోంది. కొత్త సినిమాలకు సంబంధించి అప్ డేట్స్ త్వరలో వచ్చే అవకాశం ఉంది.



# పృథ్వీరాజ్ లుక్
# జక్కన్నను తక్కువ అంచనా వేయొద్దు!




ఇంటర్నెట్డెస్క్: సినిమా లేదా పాటకు సంబంధించిన కొత్త అప్డేట్ వచ్చిన వెంటనే సామాజిక మాధ్యమాల వేదికగా అది ట్రెండ్ అవటం, దానిపై చర్చ జరగడం మనం చూస్తూనే ఉంటాం. ఆ పోస్ట్ను పట్టుకుని ఏవేవో పాత సినిమాల్లోని పాత్రలతో పోలుస్తూ పోస్టులు పెడుతుంటారు. తాజాగా అలాంటి చర్చకు తావిచ్చింది మహేశ్-రాజమౌళి మూవీ. యాక్షన్ అడ్వెంచర్ కథతో రూపొందుతున్న ఈ మూవీ నుంచి పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్ర 'కుంభ'ను పరిచయం చేశారు. అదిగో అక్కడ మొదలైంది చర్చ.

నిజంగా ఆ పాత్రలను పోలి ఉందా?

ఇందులో పృథ్వీరాజ్ సుకుమారన్ ఆటోమేటిక్ వీల్చైర్లో కూర్చొని తీక్షణంగా చూస్తూ కనిపించారు. 'కుంభ' పాత్రకు ఎడమ చేయి, రెండు కాళ్లు పూర్తిగా పనిచేయవన్నట్లు పోస్టర్లో ఉంది. కేవలం ఒక చేతి సాయంతో ఆ వీల్చైర్ను నియంత్రిస్తూ కనిపించారు. అంతేకాదు, కుర్చీకి వెనుకవైపు చేతుల్లాంటివి ఉండటం గమనార్హం. ఈ పోస్టర్ను చూడగానే చాలా మందికి గుర్తొచ్చిన మొదటి పాత్ర '24'లోని 'ఆత్రేయ'. కాలంలో ప్రయాణించే చేతి గడియారం కోసం సొంత తమ్ముడినే చంపాలనుకునే ఓ క్రూరమైన పాత్రలో సూర్య నటన అద్భుతం. అన్న, తమ్ముడు, కొడుకు మూడు పాత్రల్లో సూర్య కనిపించినా, ఆత్రేయ మాత్రం భయపెట్టేస్తాడు. అంతలా ఒదిగిపోయారు. ఇక 'క్రిష్3'లోనూ వివేక్ ఒబెరాయ్ 'కాలా' అనే సైంటిస్ట్ పాత్రలో ప్రతినాయకుడిగా నటించి మెప్పించారు. హాలీవుడ్లోనూ ఇలాంటి రెఫరెన్స్లు చాలానే ఉన్నాయి. ఇప్పుడు 'కుంభ' పాత్రను వాటితో పోలుస్తూ పోస్టులు పెడుతున్నారు.

### రాజమౌళిని తక్కువ అంచనా వేస్తున్నారా?

ఈ ఒక్క పోస్టర్ను పట్టుకుని సామాజిక మాధ్యమాల వేదికగా పలువురు ట్రోల్ చేస్తున్నారు. కానీ, 'ఈగ', 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి వాటిని చూసి కూడా రాజమౌళి విజన్ను తక్కువ అంచనా వేస్తున్నారు. భావోద్వేగాలతో కథను చెప్పడంలో రాజమౌళి మాస్టర్. ఒక్క సీన్తో సినిమా మొత్తం మారిపోతుంది. హీరో కన్నా, విలన్ ఒక మెట్టు ఎక్కువే బలంగా ఉంటాడు. రాజమౌళి కథల్లో కనిపించే ప్రధానమైన ఎలిమెంటే అది. పృథ్వీరాజ్ కుర్చీలో కూర్చొన్నాడని, ఆ పాత్రలా ఉంది.. ఈ పాత్రలా ఉంది.. అనుకుంటే తొందరపడినట్లే. ఆ పాత్ర ఎంత పవర్ఫుల్గా ఉంటుందనే దానికి కాలమే సమాధానం చెబుతుంది. ఇక ఈ వారమంతా మహేశ్-రాజమౌళి మూవీకి సంబంధించిన పలు సర్ప్రైజ్లు రానున్నాయి. ఈనెల 15న అసలైన ట్రీట్ ఇవ్వబోతున్నారు. మహేశ్ పాత్ర , లుక్, టైటిల్ను పరిచయం చేయడంతోపాటు, గ్లింప్స్ కూడా విడుదల చే సే



అవకాశం ఉంది.

పురాణాలలో 'కుంభ' పేరు ఉందా?

ఇతిహాసగాథ రామాయణంలో కుంభకర్ణుడి కుమారులను 'కుంభుడు', 'నికుంభుడు'గా పిలుస్తారు. రామ-రావణ యుద్ధంలో ఇద్దరూ పాల్గొన్నారు. ముఖ్యంగా 'కుంభుడు' ధాటికి మైందుడు, ద్వివిదుడు వంటి వానర వీరులు మూర్ఛపోతారు. ఆఖరికి పరాక్రమవంతుడైన అంగదుడు కూడా సొమ్మసిల్లిపోతాడు. దానితో సుగ్రీవుడు రంగంలోకి దిగడంతో ఇరువురి మధ్య భీకరమైన బాహు యుద్ధం జరుగుతుంది. చివరకు సుగ్రీవుడి పిడిగుద్దులతో కుంభుడు మరణించాడు. మరి దీనికీ మహేశ్బాబు సినిమాకు లింక్ ఏంటా? అని అనుకుంటున్నారా? ఇందులో మహేశ్బాబు పాత్ర హనుమంతుడిని పోలి ఉంటుందని కొంత ప్రచారం జరుగుతోంది. వారణాసి నేపథ్యంగా సాగే కథతో పాటు, 'కుంభ' పెట్టిన షరతు మేరకు సంజీవనిలాంటి దాని కోసం మహేశ్ సాగించే సాహస యాత్రగా దీన్ని తీర్చిదిద్దుతున్నారని అంటున్నారు. ఇవన్నీ ఎంత వరకూ నిజమో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .